ప్రజాశక్తి

ఆదివారం 30 మార్చి 2025 పేజీలు 8


విజయనగరం


పార్వతీపురం మన్యం


సీతంపేటలో ర్యాలీ చేస్తున్న గిరిజనులు; పార్వతీపురంలో ధర్నాలో మాట్లాడుతున్న సుబ్బరావమ్మ

గిరిజన సమస్యలపై ఐటిడిఎల వద్ద ఆందోళన

మౌలిక వసతులు కల్పించాలని, గిరిజన ఉత్పత్తులకు గిట్టుబాటు ధర ఇవ్వాలని డిమాండ్

ప్రజాశక్తి - పార్వతీపురం/సీతంపేట

గిరిజనుల పండిస్తున్న జీడి, చింతపండు, చీపురు తదితర పంటలకు గిట్టుబాటు ధర ఇవ్వాలని, గ్రామాల్లో రోడ్లు, విద్య, వైద్యం, మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ గిరిజన సంఘం, రైతు సంఘం ఆధ్వర్యాన శనివారం పార్వతీపురం, సీతంపేట ఐటిడిఎల వద్ద గిరిజనులు పెద్దఎత్తున ఆందోళనలు చేపట్టారు. ఈ పోరాటానికి సిపిఎం నాయకులు, వ్యవసాయ కార్మిక సంఘం, పలు ప్రజాసంఘాల నాయకులు మద్దతు తెలిపారు.

పార్వతీపురంలో ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి ఐటిడిఎ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం అక్కడ వద్ద ధర్నా నిర్వహించారు. అధికారులు స్పందించకపోవడంతో గిరిజనులంతా ఆగ్రహంతో ఐటిడిఎ పిఒ ఛాంబర్ వద్దకు వెళ్లి బైఠాయించారు. ధర్నానుద్దేశించి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుబ్బరావమ్మ, జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.కృష్ణమూర్తి, గిరిజన సంఘం జిల్లా గౌరవాధ్యక్షులు సీదరపు అప్పారావు, కె.రామస్వామి మాట్లాడారు. గిరిజనులు సాగు చేస్తున్న జీడి పంటతో పాటు ఇతర పంటలకు గిట్టుబాటు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. కురుపాం, సాలూరు, సీతంపేట మండలాల్లో జీడి పిక్కల పరిశ్రమ, ప్రాసెసింగ్ సెంటర్లు (మిగతా..3లో)

ఘనంగా టిడిపి ఆవిర్భావ దినోత్సవం


టిడిపి ఆవిర్భావ దినోత్సవాన్ని జిల్లా వ్యాప్తంగా శనివారం ఆ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. ఈ సందర్భంగా గజపతినగరంలో టిడిపి వ్యవస్థాపకులు ఎన్‌టిఆర్ విగ్రహానికి మంత్రి కొండపల్లి శ్రీనివాస్ నివాళులర్పించారు. 4లో


మతం కన్నా.. మానవత్వం మిన్న 2లో



వసంత రుతువును వేదిక చేసుకుని కోయిలలు సుమధుర సంగీతాన్ని ఆలపిస్తే...రెమ్మలకు తొడిగిన చివురులు, పసిపాపలు పిడికిళ్లు తెరిచి నీళ్లలో ఆడుకున్నట్లు హర్షధ్వానాలు తెలియజేస్తాయి. ఆకులు రాల్చిన మోడులు కొత్త చివురుల పీతాంబరాన్ని ధరిస్తే, ప్రకృతి పచ్చటి పట్టు పరికిణీ కట్టుకుని కొత్త పెళ్లికూతురై ముస్తాబవుతుంది. ఊరి వాకిళ్లు మామిడి తోరణాలై, లోగిళ్లు నిత్య వసంతం కావాలని ఆకాంక్షిస్తాయి. విచ్చుకున్న వేపపూలు చిరుగాలికి ఊగుతుంటే పగలే వెన్నెల కురిసినట్లు ఉంటుంది. మామిడిచెట్టుకు కాసిన పిందెలు నోరూరిస్తుంటే దాని నీడ చల్లదనాన్ని కుమ్మరిస్తుంది. షడ్రుచుల సమ్మేళనమైన ఉగాది పచ్చడిని తీర్థంగా భావించి పుచ్చుకుంటే సర్వరోగాలు, సర్వభయాలు తొలగి శుభాలు కలుగుతాయనే నమ్మకాన్ని సంప్రదాయం మనకు కలిగించింది.

తెలుగు లోగిళ్లలో తొలిపండగ

ప్రజాశక్తి - విజయనగరం

'ఉగ' అంటే నక్షత్రపు నడక అని అర్థం. నక్షత్రాలు నడక ప్రారంభించిన కాలాన్నే సృష్టి ఆరంభించిన కాలంగా భావిస్తారు. అంటే 'ఆది' ఉగాదిగా మారిపోయింది. ఉగాదినే సంవత్సరాది అని పిలుచుకుంటాం. అయితే ఒకప్పుడు హేమంత రుతువుతో సంవత్సరం ప్రారంభవుతుందని కొందరు... శిశిరంతో ప్రారంభమవు తుందని మరికొందరు అభిప్రాయపడ్డారు. కానీ జ్యోతిర్వేత్త వరాహ మిహిరుడు మాత్రం ఉత్తరాయణ వసంత కాలాన్నే ఉగాదిగా పేర్కొన్నాడు. ఎందుకంటే... రుతువుల్లో మొదటిది వసంతం. మాసాల్లో మొదటిది చైత్రం. పక్షాల్లో మొదటిది శుక్ల. తిథుల్లో మొదటిది పాడ్యమి కనుకన అన్నీ కలిసిన రోజు ఉగాదిగా ఉద్ఘాటించారు. అప్పటి నుంచి వసంతంలోనే ఉగాది జరుపుకుంటున్నారు. ఈనెల 30 నుంచి కొత్త ఉగాది 'విశ్వావసు' పేరుతో ప్రవేశిస్తుంది.

ఉగాది పంచాంగ శ్రవణం

ఉగాదికి మరో విశిష్టత పంచాంగ శ్రవణం. జ్యోతిష్యం, శాస్త్రం, నిరుక్తం, చందస్సు, వ్యాకరణం వంటి అంశాలతో కూడిన పంచాంగంలో తిథి, వార, నక్షత్ర, యోగము, కరణము అనే ఐదు యోగాలుంటాయి. ఆ రోజున పంచాంగం ద్వారా తమ రాశి చక్రాలను తెలుసు కుంటారు. వ్యవసాయ దారులు కొత్తసంవత్సరం ఎంత వానలు కురుస్తాయోనని తెలుసుకుని దాన్ని బట్టి కొందరు వ్యవసాయాన్ని లెక్కకడతారు. ఈ విధంగా ఉగాది ప్రత్యేకత పలువురిని సాంప్రదాయ రీతిలో ఆకట్టుకుంటుంది. ఉగాది రోజు పంచాంగ శ్రవణం చేస్తారు. తిథి వల్ల సంపద, వారం వల్ల ఆయుష్షు, నక్షత్రం వల్ల పాపపరిహారం, యోగం వల్ల వ్యాధి నివృత్తి, కరణం వల్ల కార్యానుకూలం కలుగుతాయని పూర్వీకులు చెబుతుంటారు. పంచాంగం ద్వారా మంచి చెడులను, గ్రహబలాన్ని తెలుసుకుని తమదైనందిన కార్యక్రమాలు చేసేవారు. భవిష్యత్తును పంచాంగం (మిగతా..3లో)

మతం కన్నా...మానవత్వం మిన్న

ఇఫ్తార్ విందులో మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-విజయనగరం

రంజాన్ పండగ సందర్భంగా ప్రభుత్వ ఆధ్వర్యంలో స్థానిక కెమిస్ట్ అండ్ డ్రగ్గిస్టు ఫంక్షన్ హాలులో శనివారం సాయంత్రం ఇఫ్తార్ విందు ఘనంగా జరిగింది. ముందుగా మతగురువు ఖాజీ హుస్సేన్ ఆధ్వర్యంలో ముస్లిం మత పెద్దలు నమాజ్ నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన రాష్ట్ర ఎంఎస్ఎమ్ఇ శాఖా మంత్రి కొండపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ, రంజాన్ పండుగ సందర్భంగా ముస్లిం సోదరులతో మమేకం అయ్యేందుకు ప్రభుత్వం ఇఫ్తార్ విందును ఏర్పాటు చేసిందని చెప్పారు. విజయనగరం మత సామరస్యానికి, మత సహనానికి మారు పేరని చెప్పారు. మతం కన్నా మానవత్వం ఎంతో ముఖ్యమని పేర్కొన్నారు. సాటి మనిషి అభివృద్ధికి, సమాజ అభివృద్ధికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మాట్లాడుతూ, అందరూ ఆనందంగా, ఆరోగ్యంతో ఉండాలని ముస్లిం సోదరులు నెల రోజుల పాటు కఠోర దీక్ష చేస్తారని చెప్పారు. విజయనగరం ఎమ్మెల్యే పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడుతూ, ముస్లింల సంక్షేమానికి టిడిపి ప్రభుత్వం ఎంతగానో కృషి చేసిందన్నారు. ముస్లిం సంక్షేమానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5,000 కోట్లు కేటాయించిందని చెప్పారు. విజయనగరం జిల్లా ఏర్పాటు వెనుక దంకేషా వలి బాబా కృషి ఎంతో ఉందని చెప్పారు.

కార్యక్రమంలో డిఆర్ఒ యార్లో ఎస్.శ్రీరామ్మూర్తి, ఆర్డీవో కీర్తి, జిల్లా మైనారిటీ సంక్షేమాధికారి ఆర్.ఎస్.జాన్, రాష్ట్ర తూర్పు కాపు ఛైర్పర్సన్ పాలవలస యశస్వి, మార్క్‌ఫెడ్ ఛైర్మన్ కర్రోతు బంగార్రాజు, టిడిపి రాష్ట్ర మైనారిటీ సెల్ ప్రధాన కార్యదర్శి షేక్ ఖాదర్ భాషా, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు ఎస్‌కెఎం భాషా, బేగం, టిడిపి, జనసేన నాయకులు పాల్గొన్నారు.

రేపు పిజిఆర్ఎస్ రద్దు

విజయనగరం టౌన్: రంజాన్ పరిష్కరించుకుని ఈ నెల 31న విజయనగరం నగరపాలక సంస్థ కార్యాలయంలో జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదికను రద్దు చేసినట్లు కమిషనర్ పల్లి నల్లనయ్య ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు గమనించాలని కోరారు.

'యూత్ పార్లమెంట్'లో మొదటి బహుమతి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

యువజన వ్యవహారాలు, క్రీడలు మంత్రిత్వ శాఖ, నెహ్రూ యువకేంద్ర సంఘటన్ ఆంధ్ర ప్రదేశ్ శాఖ ఆధ్వర్యంలో ఈనెల 28న గుంటూరు ఆచార్య నాగార్జున యూనివర్సిటీలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వికసిత్ భారత్ యూత్ పార్లమెంట్ కార్యక్రమంలో జిల్లాకు చెందిన అర్థహకుల జ్యోత్స్నకు ప్రథమ బహుమతి లభించింది. 70 సంవత్సరాల భారత రాజ్యాంగం - హక్కులు కర్తవ్యాలు- ప్రగతి అనే అంశంపై ఆంగ్ల భాషలో జ్యోత్స్న మాట్లాడింది. ఆమెకు కలెక్టర్ బిఆర్ అంబేద్కర్, నెహ్రూ యువ కేంద్రం డిప్యూటీడైరెక్టర్ కెవి ఉజ్వల, అభినందనలు తెలిపారు.

కమిటీలు ఏర్పాటు చేయాలి

విజయనగరం టౌన్: జంతు సంక్షేమ కమిటీలు మండల, డివిజనల్, జిల్లా స్థాయిలో ఏర్పాటు చేయాలని ప్రభుత్వ జీవోలను అమలుకు చర్యలు చేపట్టాలని ఆంధ్రప్రదేశ్ గో సంరక్షణ సమాఖ్య రాష్ట్ర అధ్యక్షులు లోగిశ రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం పశుసంవర్థక శాఖ జాయింట్ డైరెక్టర్ వైవి రమణ శనివారం కలిసి వినతి పత్రం అందజేశారు.

ఉగాది అందరికీ శుభాలివ్వాలి

జెడ్‌పి ఛైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

శ్రీ విశ్వావసునామసంవత్సరం జిల్లాలోని ప్రతి ఒక్కరికీ శుభాలు అందించాలని జిల్లా పరిషత్ ఛైర్పర్సన్, వైసిపి జిల్లా అధ్యక్షులు, భీమిలి నియోజకవర్గ ఇన్చార్జ్ మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆకాంక్షించారు. ఈ ఏడాది పొడవునా జిల్లాలోని ప్రతి ఒక్కరూ సుఖ సంతోషాలతో ఉండాలని ఆశించారు. తెలుగువారి నూతన సంవత్సరాది సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని ప్రజా ప్రతినిధులు, అధికారులు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలందరికీ ఆయన ఒక ప్రకటనలో ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. రైతులు సుభిక్షంగా ఉండాలని, ప్రజలంతా ఆయురారోగ్యాలతో సిరి సంపదలతో తులతూగాలని కోరారు.

నగర ప్రజలకు ఉగాది శుభాకాంక్షలు

ఉగాది, రంజాన్ సందర్భంగా నగర ప్రజలకు, ప్రజాప్రతినిధులకు,అధికారులకు మేయర్ వి.విజయలక్ష్మి శుభాకాంక్షలు తెలిపారు. నూతన వత్సరాదిలో అందరికీ శుభాలు జరగాలని, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు.

బిసి రుణాల ఎంపికకు 1667 మంది హాజరు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

బిసి రుణాల కోసం రాజీవ్‌స్టేడియంలో నిర్వహించిన లబ్ధిదారుల ఎంపిక కార్యక్రమానికి 1667 మంది హాజరయ్యారు. శనివారం నగరంలోని 31వ డివిజన్ నుండి 50 వ డివిజన్ పరిధిలో లబ్ధిదారులు తమ దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా కమిషనర్ పల్లి నల్లనయ్య మాట్లాడుతూ నగరంలో 366 యూనిట్ల ఏర్పాటుకు ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. నగర పరిధిలో శుక్రవారం 1,011 దరఖాస్తులు రాగా, శనివారం 656 దరఖాస్తులు వచ్చాయన్నారు. మొత్తంగా 1,667 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు. కార్యక్రమంలో టిపిఆర్ఓ సింహాచలం, వివిధ బ్యాంకుల మేనేజర్లు తదితరులు పాల్గొన్నారు.

ఎండిఎంకు నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

మధ్యాహ్న భోజన పథకం నిర్వహణకు సివిల్ సప్లయి ద్వారా పంపిస్తున్న నాసిరకం బియ్యంతో బిర్యానీ, పులిహోర, పరమాన్నం , ఆకుకూర, అన్నం వండి పెట్టడం వంటమ్మలకు కత్తి మీద సాముల మారిందని, నాణ్యమైన బియ్యం సరఫరా చేయాలని సిఐటియు నగర అధ్యక్షులు ఎ.జగన్మోహన్‌రావు కోరారు. శనివారం పలు పాఠశాలల్లో మధ్యాహ్నభోజన కార్మికులతో మాట్లాడారు. ప్రస్తుతం వస్తున్న ఈ బియ్యంలో నాణ్యత లోపం కారణంగా ముద్దవ్వడం, లేదా గట్టిగా ఉండడం జరుగుతుందని పిల్లలు తినలేక ఇబ్బంది పడుతున్నారని, పని భారం కూడా పెరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు అన్నారు. మధ్యాహ్న భోజన పథకానికి సన్న బియ్యం సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. గత నవంబర్లో మధ్యాహ్న భోజన పథకం బిల్లులు పెంచినట్లు కేంద్రం ప్రకటించినప్పటికీ నేటికీ అమలు కాలేదని, కొత్త మెనూ ప్రకారం అప్పులు చేసి పిల్లలకు వండి పెట్టాల్సి వస్తుందని తెలిపారు. బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గాజులరేగ జెడ్‌పి హైస్కూలులో ఎండిఎం కార్మికులతో కలిసి బియ్యాన్ని పరిశీలించారు. సిఐటియు నాయకులు కుడితి ఆదినారాయణ, కార్మికులు పాల్గొన్నారు.

1న జరిగే ప్రదర్శనలో పాల్గొనండి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆప్కాస్, ప్రైవేటు ఏజెన్సీలు వద్దు, మున్సిపల్ కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని కోరుతూ ఏప్రిల్ 1న సాయంత్రం 4 గంటలకు మున్సిపల్ ఆఫీస్ వద్ద నుంచి జరిగే ప్రదర్శనలో కార్మికులంతా పాల్గొనాలని కోరుతూ శనివారం నగరంలో మస్తర్ పాయింట్ల వద్ద ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ (సిఐటియు) ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు అశోక్, సూరి, రాఘవ, శంకర్రావు మాట్లాడుతూ ఆప్కాస్‌ను రద్దు చేసి ప్రైవేటు ఏజెన్సీలకు ఇస్తే ఉద్యోగ భద్రత ఉండదని, జీతాలు ఎప్పుడు వస్తాయో తెలియదని, పిఎఫ్, ఇఎస్ఐ సమస్యలు పెరుగుతాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఈనేపథ్యంలో కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరుతూ చేపట్టనున్న ర్యాలీలో కార్మికులంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో పలువురు కార్మికులు పాల్గొన్నారు.

ఎవరి మెప్పు కోసం లబ్ధిదారుల ఎంపిక

ప్రజాశక్తి- డెంకాడ

బీసీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగుల కోసం ప్రభుత్వం బీసీ రుణాలను అందించేందుకు నిర్ణయించింది. ఇందుకోసం మండలంలో యువతీ యువకులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్నారు. లబ్ధిదారులను గుర్తించి ఉన్నతాధికారులకు నివేదించాలని జిల్లా అధికారులు ఆదేశాలు జారీ చేశారు. జిల్లాలో వివిధ మండలాల్లో ఏప్రిల్ 2వ తేదీ నుంచి లబ్ధిదారుల ఎంపిక నిర్వహించనున్నారు. కానీ ఈ మండలంలో ఎవరి మెప్పుకోసం ప్రజా ప్రతినిధులకు గాని దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులకు గాని పూర్తి సమాచారం ఇవ్వకుండా హడావిడిగా ఇప్పటికిప్పుడు నిర్ణయం తీసుకొని లబ్ధిదారుల ఎంపిక ప్రారంభించారో అర్థం కావడం లేదు.

స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శనివారం లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియ ప్రారంభించారు. 621 మంది దరఖాస్తు చేసుకుంటే 549 మంది ఎంపిక ప్రక్రియకు హాజరయ్యారు. సుమారు 70 మంది దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారులు సమాచారం లేక ఎంపిక ప్రక్రియకు హాజరు కాలేకపోయారు. మండల పరిధిలో ఉన్న వివిధ బ్యాంకుల మేనేజర్లు సమాచారం లోపంతో హాజరు కాలేదు. లబ్ధిదారులకు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారు.

బిసి కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపిక

నెల్లిమర్ల: నగర పంచాయతీలో బిసి కార్పొరేషన్ రుణ లబ్ధిదారుల ఎంపిక ఇంటర్వ్యూలు శనివారం స్థానిక బైరెడ్డి సూర్యనారాయణ కల్యాణ మండపంలో నగర పంచాయతీ ఛైర్పర్సన్ బంగారు సరోజినీ ఆధ్వర్యంలో నిర్వహించారు. నగర పంచాయతీ పరిధిలో బిసి కార్పొరేషన్ ద్వారా ఆన్లైన్‌లో లోన్‌లు కోసం 439 మంది దరఖాస్తులు చేసుకోగా, దరఖాస్తులు పరిశీలనకు 335 మంది హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో వైస్ ఛైర్మన్ సముద్రపు రామారావు, నగర పంచాయతీ కమిషనర్ కె.అప్పలరాజు, వార్డు కౌన్సిలర్లు, మెప్మా సిఎంఎం డి.గోవిందరావు, సిఒలు, సిబ్బంది పాల్గొన్నారు.

గుర్ల: బిసి కార్పొరేషన్ రుణాల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి శనివారం ఎంపిడిఒ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహించారు. 42 పంచాయతీల నుంచి 624 మంది దరఖాస్తు చేసుకోగా 587 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారు. మండలానికి 101 యూనిట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. మండల పరిధిలో ఉన్న బ్యాంక్ అధికారులు హాజరయ్యారు.

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

పేద మధ్య తరగతి ప్రజలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని విజయనగరం మున్సిపల్ మాజీ ఛైర్పర్సన్ ప్రసాదుల కనకమహాలక్ష్మి విజ్ఞప్తి చేశారు. శనివారం టిడిపి వ్యవస్థాపక దినోత్సవాన్ని పురస్కరించుకొని కొత్తపేట నీళ్లట్యాంకు వద్ద ఆ పార్టీ నాయకులు ఏర్పాటుచేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ మంచు కుమారస్వామి మాట్లాడుతూ నేత్ర సంబంధిత సమస్యల పట్ల ప్రజలు నిర్లక్ష్యం వహించరాదన్నారు. చక్కెర రోగులకు గ్లకోమా వంటి వ్యాధులు వచ్చే అవకాశం ఉన్నందున అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో డాక్టర్ రవళి, ఆసుపత్రి ఏవో బాబ్జి, తెలుగు దేశం పార్టీ నాయకులు సి హెచ్ దుర్గాప్రసాద్, పేరి రామయ్య పంతులు పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, స్థానికులు పాల్గొన్నారు.

వివాహానికి రూ.50వేలు ఆర్థిక సాయం

ప్రజాశక్తి- భోగాపురం

మండలంలోని చాకివలసలో ఓ నిరుపేద కుటుంబానికి చెందిన కదంబ శ్రీను తన కూతురి వివాహానికి కనీస ఖర్చులు కూడా పెట్టుకోలేని స్థితిలో ఉండటంతో విషయం తెలుసుకున్న జనసేన నాయకులు ఎమ్మెల్యే లోకం నాగ మాధవి ఆదేశాల మేరకు జనసేన నాయకులు లంక సత్యనారాయణ ఆధ్వర్యంలో రూ.50 వేలు ఆర్థిక సాయాన్ని శనివారం అందించారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు వందనాలు రమణ, మట్ట అయ్యప్పరెడ్డి, చాకివలస పంచాయతీ ప్రెసిడెంట్ లంక రాము, చెల్లుబోయిన రాము, పడాల శ్రీను, సిహెచ్‌సి మెంబర్స్ బొల్లు త్రినాధ్, రాధాకృష్ణ రెడ్డి, మాత నవీన్, గుండు దిలీప్, మైలపల్లి నరసింహులు, దాలిరెడ్డి, రాంబాబు, సీతమ్మనాయుడు, అప్పలనాయుడు, షణ్ముఖ, గోవింద్ పాల్గొన్నారు.

పోక్సో చట్టంపై అవగాహన సదస్సు

ప్రజాశక్తి- నెల్లిమర్ల

స్థానిక కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయం(కెజిబివి)లో జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో శనివారం పోక్సో చట్టంపై న్యాయ అవగాహన సదస్సును నిర్వహించారు. మహిళా కోర్టు న్యాయమూర్తి ఎన్ పద్మావతి మాట్లాడుతూ ప్రస్తుత రోజుల్లో బాలికలు చాలా జాగ్రత్తగా ఉండాలని వారి పట్ల ఎవరైనా అనుచితంగా, అసభ్యంగా ప్రవర్తిస్తే ముందుగా తల్లిదండ్రులకు, క్లాస్ టీచర్‌కు తెలియజేయాలన్నారు. 2012లో ఏర్పడిన పోక్సో చట్టం గురించి వివరంగా తెలిపారు. నో, గో, టెల్ అనే మూడు ముఖ్యమైన టెక్నిక్స్ గురించి బాలికలకు వివరించారు. బాలల హక్కులను కాపాడడానికి జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ ఎప్పుడూ ముందుంటుందని ఈ సందర్భంగా తెలిపారు. 18 సంవత్సరాల లోపు ఉన్న బాల బాలికలు చదువుపై దృష్టి పెట్టాలన్నారు. 18 సంవత్సరాల లోపు ఉన్న విద్యార్థులకు బాల్య దశ నుంచే రాజ్యాంగం పట్ల కొన్ని సామాన్యమైన చట్టాల పట్ల అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రుల పట్ల ఉపాధ్యాయుల పట్ల గౌరవంతో మెలగాలని నైతిక విలువలు నేర్చుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో బాలల హక్కుల ఫోరం జిల్లా కన్వీనర్ పి.చిట్టయ్య, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ మెంబర్ ఎస్.చిట్టి బాబు, ఎస్ఐ బి.గణేష్, ప్రిన్సిపాల్ బి.ఉమా, జిల్లా న్యాయ సేవ అధికార సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

కోర్టు ఆవరణలో న్యాయ అవగాహన సదస్సు

రాజాం: స్థానిక కోర్టు ఆవరణంలో శనివారం న్యాయ సేవా సంస్థ ఆధ్వర్యంలో సీనియర్ సివిల్ జడ్జి కె. శారదాంబ అధ్యక్షతన న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ స్త్రీలను గౌరవించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని, పనిచేసే ప్రదేశాల్లో లైంగిక వేధింపులకు పాల్పడితే కఠిన శిక్షలు తప్పవు అని హెచ్చరించారు. లైంగిక వేధింపుల కిందకు ఏవేవి పరిగణంలోకి తీసుకోవాలి, పనిచేసే ప్రదేశం కిందకు ఏమేమి వస్తాయో తెలిపారు. పని చేసే ప్రదేశాలలో ప్రతి ఒక్కరూ స్నేహితులుగా సోదరభావంతో పనిచేయాలని సూచించారు. నాయ్య వ్యవస్థకు సంబంధించి హెడ్ క్వార్టర్ జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఒక కమిటీని ఏర్పాటు చేశారన్నారు. ఈ కమిటీలో ఒక న్యాయమూర్తి సభ్యులుగా ఉంటారని అన్నారు. మహిళలు కూడా ఈ చట్టాన్ని ఆసరాగా తీసుకొని అనవసరమైన కంప్లైంట్లు సహ ఉద్యోగులపై ఇవ్వకూడదని కోరారు. ఈ సదస్సులో సీనియర్, జూనియర్ కోర్టు సిబ్బంది, మండల న్యాయ సేవా సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రస్ట్ సమాజానికి దిక్సూచిగా ఉండాలి

ప్రజాశక్తి - పూసపాటిరేగ


నిర్వాహకులను సత్కరిస్తున్న ఎమ్మెల్సీ రఘువర్మ

ట్రస్ట్‌లు సమాజానికి దిక్సూచిగా ఉండాలని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. శనివారం మండల కేంద్రంలోని శాలివీధిలో విశ్రాంత ఉపాధ్యాయులు ఇమంది అప్పారావు ఛైర్మన్‌గా ఏర్పాటు చేసుకున్న చైతన్య ఫౌండేషన్‌ను ఆయన ప్రారంభించారు. పేద విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వర్గీయ తన కుమారుడు చైతన్య పేరుమీద ట్రస్ట్ ఏర్పాటు చేసి సేవ చేయాలన్న ఆశయం గొప్పదన్నారు. సంస్థ ఛైర్మన్ అప్పారావు మాట్లాడుతూ తన కుమారుడు పేరుపై ట్రస్ట్ పెట్టి సమాజంలో బలహీనులకు సేవ సేయాలన్నదే తన ఉద్దేశం అన్నారు. బలహీనుల పక్షాన తాను ఉన్నానని, వారికి అవసరమైన ధన, వస్తు రూపంలో సేవలు అందిస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ బొంపల సీతారాం, ఎంపిటిసి పిన్నింటి లక్ష్మునాయుడు, మాజీ సర్పంచ్ పిన్నింటి సన్యాసినాయుడు, నాయకులు మహంతి జనార్దనరావు, రిటైర్డ్ స్టేట్‌బ్యాంక్ చీఫ్‌మేనేజర్ కోరాడ సత్యనారాయణ, రిటైర్డ్ ఎంపిడిఒ జి. రామారావు, అఖిల భారత పద్మశాలీ సంఘం ప్రధాన కార్యదర్శి, ఆంధ్రాయూనివర్శిటీ ప్రొఫెసర్ వానపల్లి వెంకటరావు, రిటైర్డ్ హెచ్‌ఎం కస్పా వెంకటరావు, కప్పల రామారావు, వానపల్లి శ్రీను, కప్పల అప్పలరాజు, ఇమంది కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

ఖర్చు ఎక్కువ...ఆదాయం తక్కువ

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి

ఔను..! ఈ ఏడాది ప్రజలందరికీ ఖర్చు ఎక్కువ ఆదాయం తక్కువట... శ్రావణ పంచాంగంలో ఎవరి పేరు బలం ఎతికినా ఇదే పరిస్థితి కనిపిస్తుందట. కాకపోతే ఇది రామమందిరంలోనూ, రచ్చబండవద్దో పంతులుగారి పంచాంగం కాదు. ఇటీవల కాలంలో ఏలికల చర్చల్లో ఇదే వ్యక్తమైన మాటలు అంటూ జనం చర్చించు కుంటున్నారు. ఉగాది తెలుగువారి సంస్కృతిలో అంతర్భాగం. ఉగాదిని కొత్త సంవత్సరానికి నాందిగా భావిస్తారు. ప్రతి పండగలో సామాజిక అవసరాలు సమకూర్చే ప్రజల భాగస్వామ్యం, ఆనందాలు, కళారూపాల విహారాలు ఉన్నట్టే ఉగాది పండగ కూడా ప్రజల ఆనందాలకు నిలయమైంది. ముఖ్యంగా పంచాంగ శ్రవణం ద్వారా కొత్త సంవత్సరం బాగోగులు గురించి తెలుసుకోవడం, చర్చించుకోవడం ఉగాది ప్రత్యేకత. ప్రతి గ్రామకూడలిలో పురోహిత పండితులు పంచాంగ శ్రవణం చేస్తుంటే చుట్టూ గ్రామీణ ప్రజలు కూర్చుని వినడం, సందేహాలు నివృత్తి చేసుకోవడం ఆనవాయితీగా వస్తున్న ఆచారం. ఉగాది రోజున ఆనందంగా గడిపితే సంవత్సరమంతా ఆనందంగా ఉంటుందని నేటికీ ప్రజలు బలంగా నమ్ముతుంటారు. ముఖ్యంగా రైతుల్లో ఇటువంటి నమ్మకం కాస్త ఎక్కువగానే ఉంటుంది. ఇటువంటి చర్చ నేటి ఉగాది సందర్భంగా కాస్త శాస్త్రీయ బద్ధంగా సాగుతోంది. తమ భవిష్యత్తు నామవాచకాన్ని బట్టి కాకుండా పాలకుల పనితీరు, చిత్తశుద్ధిపై ఆధారపడుతుందని కాస్త శాస్త్రీయ ఆలోచన, రాజకీయ అవగాహన ఉన్నవారిలో కాస్త ఎక్కువగానే వినిపిస్తోంది. ఇందుకు కారణం లేకపోలేదు. ఎన్నికల ముందు వరకు సంపద ఎలా సృష్టించాలో తమకు తెలుసు అన్నవారే... ఇప్పుడు ఆదాయం ఎలా వస్తుందో చెప్పండి... అంటూ



మాటలు వల్లేస్తున్న తీరు నిజంగానే ఉమ్మడి విజయనగరం జిల్లాను శ్రీవిశ్వావసు నామ ఉగాది సవంత్సర ఆరంభం వేళ కలవర పాటుకు గురిచేస్తున్నాయి. ఇటీవల కాలంలో ముఖ్యంగా రైతులకు సంబంధించి నిత్యవసర సరుకుల ధరలు, ఎరువులు, పెరుగుల మందుల ధరలు, ట్రాక్టర్ అద్దెలు రైతులకు తలకుమించిన భారంగా మారాయి. విద్యుత్ ఛార్జీలు పెరిగాయి. స్కూళ్లు, కాలేజీల ఫీజులు, పుస్తకాల ధరలు, మందులు, వైద్యుల ఫీజులు, వైద్యపరీక్షల ఛార్జీలు ధరలు కూడా ఆకాశానికి అంటుతున్నాయి. ఇలా చెప్పుకుంటూ పోతే సగటు కుటుంబం లేదా మనిషి ఖర్చులు తలకుమించిన భారంగా పరిణమించాయనడంలో సందేహం లేదు. కానీ, అందుకు తగ్గట్టు వ్యవసాయ ఉత్పత్తుల ధరలు మాత్రం పెరగలేదు. ఎరువుల ధరలు రూ.వేలల్లో పెరిగితే వ్యవసాయ ఉత్పత్తుల ధరలు రూ.వందల్లో పెరిగాయి. పెరిగిన అత్తెసరు ధరలు కూడా అమలు జరిగే పరిస్థితి జిల్లాలో ఏనాడూ కనిపించలేదు. ఇటీవల ప్రకటించిన అపరాల ధరలు కూడా ఇందుకు మినహాయింపు కాదు. ప్రభుత్వం తరపున తగినంతగా మార్కెట్ సదుపాయం కల్పించకపోవడమే ఇందుకు కారణం అని జనాల్లో చర్చమొదలైంది. ఏజెన్సీలో , జీడి, చింతపండుకు గిట్టుబాటు ధర లేదు. మైదానంలో నీరులేక వ్యవసాయ భూములు బీడువారుతున్నాయి. చెరుకు ఫ్యాక్టరీలు మూతపడడంతో రైతులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ వైఖరి వల్ల పశు సంపద కూడా తగ్గిపోయింది. వాతావరణం అనుకూలించక పోవడంతో చివరకు ఉగాది వంటి పర్వదినంలో కూడా కొన్ని ప్రాంతాల్లో మామిడి కాయలు మచ్చుకు కూడా కనిపించని పరిస్థితి ఉంది. రైతులు, గ్రామీణ ప్రజలు ఎంతో ప్రతిష్టాత్మకంగా, సంప్రదాయ బద్ధంగా జరుపుకునే పండగలను ఈసారి పంతులగారి పంచాంగ ప్రవచణాలతోపాటు రాజకీయాలతో ముడిపడివున్న వాస్తవ పరిస్థితులపై కూడా ఉమ్మడి జిల్లాల్లో పబ్లిక్ టాక్ వినిపిస్తోంది. ఖర్చు ఎక్కువ..ఆదాయం తక్కువతో బతికేది ఎలా అంటూ జనం చర్చించుకుంటున్నారు.

గిరిజన సమస్యలపై ఐటిడిఎల వద్ద ఆందోళన

(మొదటిపేజీ తరువాయి)

ఏర్పాటు చేసి 80 కేజీల జీడి బస్తా రూ.16 వేలకు కొనుగోలు చేయాలని కోరారు. అన్ని గిరిజన గ్రామాలకు బస్సు, రోడ్డు, మంచినీటి సౌకర్యం కల్పించాలన్నారు. గిరిజనులు సాగు చేస్తున్న పోడు భూములకు పట్టాలివ్వాలని కోరారు. సాలూరు, కురుపాం, సీతపేటలో వంద పడకల ఆసుపత్రులను నిర్మించాలని, చెక్‌డామ్‌లు పూర్తి చేసి గిరిజన రైతులకు సాగునీరందించా లన్నారు. అధికారులు స్పందించక పోవడంతో పిఒ ఛాంబర్‌వద్ద బైఠాయించడంతో ఎపిఒ మురళీధర్ బయటకు వచ్చి సమస్యలు విన్నారు. జీడి ప్రాసెసింగ్ చేసే చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ఇతర సమస్యలపై పిఒతో చర్చిస్తామన్నారు. సమస్యలు వెంటనే పరిష్కరించే దిశగా ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాలని, లేకుంటే భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఆందోళనలో చేపడతామని నాయకులు హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఎన్.వై.నాయుడు, గిరిజన సంఘం నాయకులు వాసు, సీతారాం, రామారావు, పాలమిట్ట రాము, సోములు, వీరయ్య, గంగారం, బిడ్డిక అనిల్, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, కె.ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. ఐద్వా జిల్లా కార్యదర్శి రెడ్డి శ్రీదేవి, సిఐటియు నాయకులు కొల్లి సాంబమూర్తి, కె.ఈశ్వరరావు, డివైఎఫ్ఐ నాయకులు రాజశేఖర్, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు మర్రి శ్రీను, ఎస్ఎఫ్ఐ నాయకులు మద్దతు తెలిపారు.

15 తేదీలోగా ధర ప్రకటించకపోతే ఐటిడిఎ దిగ్బంధం

సీతంపేట ఐటిడిఎ కార్యాలయం వద్ద గిరిజనులు ధర్నా చేశారు. ముందుగా సిఐటియు కార్యాలయానికి చుట్టుపక్కల గ్రామాల నుంచి వందలాదిమంది గిరిజనులు చేరుకున్నారు. అక్కడ నుంచి సంత మార్కెట్ వరకు ర్యాలీ చేస్తూ జీడిపిక్క బతుకు పక్కా, మార్కెట్ ధర కల్పించి జిసిసి కొనుగోలు చేయాలంటూ నినాదాలు చేస్తూ గిరిజన వేషధారణలో భాగంగా ఆకులు కట్టుకుంటూ ఐటిడిఎ వరకు ర్యాలీ నిర్వహించారు. అక్కడి నుంచి ఐటిడిఎ లోపలికి వెళ్తూ గేటు వద్ద బైఠాయించారు. ధర్నానుద్దేశించి గిరిజన సంఘం నాయకులు ఎం.తిరుపతిరావు మాట్లాడుతూ కొండచీపుర్లు గిరిజనుల వద్ద కారుచౌకగా రూ.25కు దళారులు దోపిడీ చేస్తున్నా అధికారులు చోద్యం చూస్తున్నారని విమర్శించారు. వంద పడకల సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి పనులు ఏళ్ల గడుస్తున్నా పూర్తి కాలేదన్నారు. తక్షణమే ఆసుపత్రి పనులు పూర్తి చేయకపోతే ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఎగువదార బంధం, పాలమానుగూడ తదితరు గ్రామాల్లో ఇప్పటికీ రహదారి పనులు పూర్తికాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గిరిజన విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేందుకు ఐటిడిఎ పరిధిలో తక్షణమే పీజీ కళాశాల ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమస్యలన్నింటినీ ఏప్రిల్ 15 కల్లా పరిష్కరించకపోతే ఐటిడిఎను దిగ్బంధిస్తామని హెచ్చరించారు. అనంతరం ఎపిఒ చిన్నబాబుకు వినతి పత్రం చేశారు. ఈ ర్యాలీలో గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు ఎం.లక్ష్మణరావు, సర్పంచులు జీలకర్ర సుందరమ్మ, వీరన్న, భాస్కరరావు, నాయకులు ఎం.కాంతారావు, సాంబయ్య, శ్రీరాములు, గంగాధర్, అధిక సంఖ్యలో గిరిజనులు పాల్గొన్నారు.

తెలుగు లోగిళ్లలో తొలిపండగ

(మొదటిపేజీ తరువాయి)

తెలుపుతుందనేది కొందరి విశ్వాసం.

ఏదీ నిజమైన ఉగాది?

ఉగాదులొస్తున్నాయ్... పోతున్నాయ్. కానీ పేద, మధ్య తరగతి ప్రజలకు తీరని ఆశలు ఎన్నో, ఎన్నెన్నో.... ఉగాది పచ్చడిలోని తీపి ఉన్నవాడికే దక్కుతుంది. లేని వాడికే చేదు మిగిలిపోతుంది. ఎన్నో ఉగాదుల్ని దాటుకుంటూ వచ్చినా... గూడులేని అభాగ్యులెందరో, కూడులేని అన్నార్తులెందరో. కులాలూ, మతాలూ ఇంకా కత్తులు దూస్తూనే ఉన్నాయి. మనిషిని మనిషే దోచుకునే సమాజం కొనసాగుతూనే ఉంది. వరకట్నం యువతి మెడలో ఉరితాడై వేలాడుతూనే ఉంది. మహిళలపై హత్యలు, అత్యాచారాలు, దాడులు పెరుగుతునే ఉన్నాయి. నిరుద్యోగం రోజురోజుకు తీవ్రమవుతుంది. ఉపాధి కరువై మరింత మంది రోడ్డున పడుతూనే ఉన్నారు. ప్రభుత్వ రంగ సంస్థలు కార్పొరేట్ శక్తులకు పాలకులు కారుచౌకగా అమ్మేస్తున్నారు. ధనవంతులను మరింత ధనవంతులుగా, పేదలు మరింత పేదలుగా మారుతున్నారు. సామాన్యుల జీవన ప్రమాణాలను మరింత దిగజార్చుతున్నారు. పాలకుల విధానాల వల్ల పాతాళానికి నెట్టబడుతున్న సామాన్యుడు ఆ విధానాలకు వ్యతిరేకంగా నిలిచి ఉద్యమించిన నాడే సమస్యలకు నిజమైన పరిష్కారం లభిస్తుంది. అప్పుడే నిజమైన ఉగాది.

నీటి ఎద్దడి నివారణకు చర్యలు

ప్రజాశక్తి-కొత్తవలస

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు చేపట్టాలని మండల ప్రత్యేకాధికారి బి.రామానందం కోరారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, గ్రామ కార్యదర్శులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వేసవిలో మంచినీటి సమస్య ఏ పంచాయతీలోనూ రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు, కార్యదర్శులపై ఉందన్నారు. పంచాయతీల్లో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని, ఉపాధి పని ప్రాంతాల్లో తాగునీటి సౌకర్యం కల్పించాలని ఆదేశించారు. సమావేశంలో ఎంపిడిఒ, ఇఒపిఆర్‌డి, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

5న విఆర్‌ఎల రాష్ట్ర సదస్సు

ప్రజాశక్తి-బొబ్బిలిరూరల్

ఏప్రిల్ ఐదో తేదిన విఆర్‌ఎల రాష్ట్ర సదస్సును విజయవాడలో నిర్వహిస్తున్నట్లు సిఐటియు జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, విఆర్‌ఎల సంఘం మండల అధ్యక్షులు లక్ష్మణరావు తెలిపారు. శనివారం స్థానిక తహశీల్దార్ కార్యాలయం వద్ద మండలంలోని విఆర్‌ఎలతో సమావేశం నిర్వహించారు. విఆర్‌ఎల సంఘం నాయకులు అప్పారావు, ముని, మారయ్య, రాజారావు పాల్గొన్నారు.

గురజాడలో గ్రాడ్యుయేషన్ వేడుకలు



ప్రజాశక్తి -విజయనగరంటౌన్

నగరంలోని గురజాడ పాఠశాలలో శనివారం గ్రాడ్యుయేషన్‌డే వేడుకలు ఘనంగాజరిగాయి. ముఖ్యఅతిథిగా రోటరీ గవర్నర్, ప్రముఖ చిన్నపిల్లల వైద్య నిపుణులు ఎం.వెంకటేశ్వరరావు, మిమ్స్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ చల్లా భవానీశంకర్ హాజరై మాట్లాడారు. పాఠశాల డైరెక్టర్ ఎంవిఆర్ కృష్ణాజి, కరస్పాండెంట్ ఎం.స్వరూప, హెచ్‌ఎం పూడి శేఖర్ పాల్గొన్నారు. చిన్నారుల సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి.

ముందస్తు జాగ్రత్తలు తప్పనిసరి

ప్రజాశక్తి-రామభద్రపురం

వేసవిలో ప్రజలకు ఇబ్బందులు కలగకుండా ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మండల ప్రత్యేకాధికారి ప్రశాంత్ కుమార్ తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిడిఒ రత్నం అధ్యక్షతన వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తాగునీటి సమస్య రాకుండా క్రాష్ ప్రోగ్రామ్ విజయవంతం చేయాలన్నారు. అన్ని గ్రామాల్లో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా చేపట్టి, మురుగు నీరు సక్రమంగా పారే ఏర్పాట్లు చేసి, దోమలమందు పిచికారీ చేయాలన్నారు. పంచాయతీ కార్యదర్శులు పని ప్రదేశాల్లో నివాసముంటూ ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ సులోచనారాణి తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు 'నాంది' వితరణ

వేపాడ : మండలంలోని బక్కునాయుడుపేట వద్దనున్న బిఆర్ అంబేద్కర్ గురుకులంలో విద్యార్థులకు శనివారం నాంది ఫౌండేషన్ బ్యాగులు, టీషర్టులు, షూ అందజేసింది. కార్యక్రమంలో ప్రిన్సిపల్ యు.ఉషారాణి, వైస్ ప్రిన్సిపల్ లక్ష్మి, నాంది ఫౌండేషన్ ప్రతినిధులు నాగ ప్రసన్న, గంగా భవాని పాల్గొన్నారు.



బొద్దాంలో అనుపోత్సవం నిర్వహిస్తున్న గ్రామస్తులు

గ్రామాల్లో పండగ సందడి

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని ఆతవ, వావిలపాడు, బొద్దాం, వేపాడ గ్రామాల్లో శనివారం నూకాలమ్మ పండగ సందడి నెలకొంది. ఈ సందర్భంగా ఆలయాలకు జనం పోటెత్తి, మొక్కులు తీర్చుకున్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో భారీగా అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటుచేశారు.

నేరాలు ఘోరాలు

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-డెంకాడ

మండలంలోని పినతాడివాడ కూడలి సమీపంలో శనివారం రాత్రి సంభవించిన రోడ్డు ప్రమాదంలో ఓ యువకుడు మృతిచెందాడు. విజయనగరంలోని విటి అగ్రహారానికి చెందిన నేమాల రవి(26) స్నేహితుడితో కలిసి బైక్‌పై నాతవలస నుంచి విజయనగరం వైపు వస్తున్నాడు. పినతాడివాడ కూడలి సమీపంలోకి వచ్చేసరికి ఎదురుగా వస్తున్న మరో బైక్‌ను ఢీకొన్నారు. దీంతో రవితోపాటు మరో ముగ్గురికి గాయాలయ్యాయి. విజయనగరంలోని ఆస్పత్రికి తరలిస్తుండగా పరిస్థితి విషమించి రవి మృతిచెందాడు. మరొకరి పరిస్థితి విషమంగా ఉంది. డెంకాడ పోలీసులు కేసు నమోదు చేశారు. రవి సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌గా పనిచేస్తున్నాడు.

మద్యంతో ఇద్దరు అరెస్టు

ప్రజాశక్తి-కొమరాడ

ఒడిశా నుంచి ఆంధ్రలోకి అక్రమంగా మద్యం తరలిస్తున్న వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు కొమరాడ ఎస్ఐ కె.నీలకంఠం తెలిపారు. శనివారం కూనేరు చెక్ పోస్ట్ సమీపంలో ఒడిస్సా క్యారెట్ వైన్ షాపు నుంచి ఆంధ్రలోకి 18 బీర్ బాటిల్స్‌ను తరలిస్తుండగా వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. కూనేరు జంక్షన్ వద్ద ఒడిస్సాకి కెరడలో గల మద్యం దుకాణం నుంచి 18 మద్యం బాటిల్స్‌తో ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా బంధుగాం బాకల్ నాగళ్లవలసకు చెందిన హిమరక ప్రకాష్‌ను అదుపులోకి తీసుకున్నామన్నారు. అతని వద్ద ఉన్న బాటిళ్లను స్వాధీనం చేసుకుని అతనిపై కేసు నమోదు చేసినట్టు తెలిపారు.

బొబ్బిలి : మండలంలోని గొంగాడవలసలో బెల్ట్‌షాపుపై దాడి చేసి, 10 మద్యం సీసాలతో వ్యాపారిని అరెస్టు చేసినట్లు ఎక్సైజ్ సిఐ పి.చిన్నంనాయుడు చెప్పారు. గ్రామంలో బెల్ట్ షాపు నిర్వహిస్తున్నట్లు సమాచారం రావడంతో శనివారం దాడి చేశారు. అక్రమంగా మద్యం తరలించినా, బెల్ట్ షాపులు నిర్వహించినా కఠిన చర్యలు తీసుకుంటామని సిఐ హెచ్చరించారు.

టిడిపి ఆవిర్భావ దినోత్సవ చిత్రమాలిక






సాలూరులో కేకు కట్ చేస్తున్న మంత్రి సంధ్యారాణి

బొబ్బిలి, పార్వతీపురం, కురుపాంలో ఎన్‌టిఆర్ విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యేలు బేబినాయన, బోనెల విజయ్‌చంద్ర, తోయక జగదీశ్వరి






శృంగవరపుకోటలో సుధారాజుకు కేకు తినిపిస్తున్న ఎమ్మెల్యే లలితకుమారి ; వేపాడ, బాడంగిలో ఎన్‌టిఆర్‌కు నివాళులర్పిస్తున్న గొంప వెంకటరావు, బుడా చైర్మన్ తెంటు లక్ష్మునాయుడు, నెల్లిమర్లలో సీనియర్ కార్యకర్తను సత్కరిస్తున్న మార్క్‌ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగార్రాజు

ఇసిజి పనిచేస్తుందా.? : డిఎంహెచ్‌ఒ

ప్రజాశక్తి- డెంకాడ

ఎఫ్‌డిపి వాహనంలో ఇసిజి పనిచేస్తుందా? ఎవరికైనా ఇసిజి తీస్తున్నారా? అని ల్యాబ్ టెక్నీషియన్‌ను డిఎంహెచ్‌ఒ డాక్టర్ జీవనరాణి ప్రశ్నించారు. మండలంలోని మోదవలసలో ఎఫ్‌డిపి కార్యక్రమాన్ని ఆమె శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఎఫ్‌డిపి వాహనంలో ఎక్విప్మెంట్ ఎలా పనిచేస్తున్నాయని డిఇఒ సంతోషిని అడిగి తెలుసుకున్నారు. రోగులకు ఈ వాహనంలో ఎన్ని రకాలు టెస్టులు చేస్తున్నారు ఎన్ని రకాల మందులు ఇస్తున్నారని సిబ్బందిని అడిగారు. ఎఎన్ఎం వెంకటలక్ష్మిని గ్రామంలో ప్రజల ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. వేసవి దృశ్య ప్రజలందరూ అప్రమత్తగా ఉండాలని వడదెబ్బకు గురికాకుండా ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో హెల్త్ సూపర్వైజర్ ఎస్ సూరిబాబు, ఎంఎల్‌హెచ్‌పి గౌరీ, ఏఎన్ఎంలు రాజేశ్వరి, వెంకటలక్ష్మి, ఆశ కార్యకర్త శాంతి పాల్గొన్నారు.

బంగారయ్యకు గురుబ్రహ్మ ఉగాది పురస్కారం

ప్రజాశక్తి - నెల్లిమర్ల

తంగుడుబిల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గణిత ఉపాధ్యాయుడు శివుకు బంగారయ్య మాస్టర్‌కు గురుబ్రహ్మ ఉగాది పురాష్కారం లభించింది. శనివారం విశాఖపట్నం విజెఎఫ్ ప్రెస్ క్లబ్‌లో విశాఖపట్నానికి చెందిన మదర్ థెరిస్సా స్వచ్ఛంద సేవా సంస్థ గురుబ్రహ్మ ఉగాది పురస్కారంతో పాటు విద్యారంగంలో ఆణిముత్యం అవార్డును బంగారయ్యకు వ్యవస్థపాక అధ్యక్షులు కె.కృష్ణమూర్తి చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బంగారయ్య మాస్టారు కృషి, పట్టుదలతో నిస్వార్ధంగా ఉపాధ్యాయ రంగానికి సేవలు అందిస్తున్నందుకు గాను ఈ అవార్డులు అందజేశామన్నారు. జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత సూరంపూడి ఎవిఎస్ఎస్ మూర్తి అధ్యక్షతన వహించిన ఈ కార్యక్రమంలో సమాజ సేవకులు చెల్లూరి భాస్కరరావు, ఆంధ్ర యూనివర్సిటీ జియో ఫిజిక్స్ విభాగ ఆచార్యులు డాక్టర్ పెంటకోట త్రినాధరావు తదితరులు పాల్గొన్నారు.

రైతు సమస్యల పరిష్కారానికి కృషి

మంత్రి కొండపల్లి శ్రీనివాస్

ప్రజాశక్తి-బొండపల్లి

రైతుల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం కృషి చేస్తుందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తెలిపారు. శనివారం బొండపల్లిలో బివి ఛానెల్ 13 వంతుల కాలువకు సంబంధించిన రైతుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ గజపతినగరం, బొండపల్లి మండలాల రైతులు ఆంధ్ర జలాశయం నీటి ద్వారా పంటలు పండిస్తున్నారని గుర్తు చేశారు. పత్రువాడ వద్ద చంపావతి నదిలో కాలువ నిర్మాణం చేపట్టడం ద్వారా సుమారు 2,700 ఎకరాలకు నీరు అందించేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో తహశీల్దార్ రాజేశ్వరరావు, ఎంపిడిఒ జి.గిరిబాల, ఎఒ మల్లికార్జునరావు, టిడిపి మండల అధ్యక్షులు కోరాడ కృష్ణ, బివి ఛానెల్ అధ్యక్షులు రమేష్ రాజు, 13వ వంతుల కాలువ అధ్యక్షులు బి.మురళీరాజు, మాజీ జెడ్‌పిటిసి సభ్యులు మక్కువ శ్రీధర్, సర్పంచ్ నంబూరి రాజేష్, సీనియర్ నాయకులు బుద్ధరాజు సత్యనారాయణ రాజు, పివి గోపాలరాజు, చింతలపాటి శ్రీనురాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్

సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - చీపురుపల్లి

నియోజక వర్గంలోని చీపురుపల్లి, మెరకముడుదాం, గరివిడి, గుర్ల మండలాల్లో అనారోగ్యం పాలైన బాధిత కుటుంబాలకు సిఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను టిడిపి రాష్ట్ర కార్యదర్శి కిమిడి రామ మల్లిక్ నాయుడు శనివారం పంపిణీ చేశారు. పార్టీ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో ఉన్న ఎన్.టి.రామారావు విగ్రహానికి స్థానిక టిడిపి నాయకులతో కలసి పూలమాలలు వేసి నివాళులర్పించారు అనంతరం బాదిత కుటుంబాలకు చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు త్రిమూర్తులు రాజు, రౌతు కామనాయుడు దన్నాన రామచంద్రుడు, గవిడి నాగరాజు, కిరణ్ రాజు, రౌతు రమేష్ పాల్గొన్నారు.

ఆలయాల నిర్మాణానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - భోగాపురం

మండలంలోని గూడెపువలస సర్పంచ్ మట్టా అయ్యప్ప రెడ్డి ఆలయాల నిర్మాణానికి ఆర్థిక సహాయం శనివారం అందించారు. చేపలకంచెరులో నూతనంగా నిర్మిస్తున్న రెండు అమ్మవారి గుడులకు రూ.25వేలు అందజేశారు. ఈ సహాయాన్ని చేపలకంచెరు గ్రామ పెద్దలకు అందజేశారు.

అధ్యక్షులుగా అరుణ మాకొద్దు

నవోదయ గ్రామైక్య సంఘ సభ్యులు మూకుమ్మడిగా తీర్మానం

ప్రజాశక్తి-రామభద్రపురం

ఆరికతోట నవోదయ గ్రామైక్య సంఘం అధ్యక్షురాలుగా కిల్లాడ అరుణ వద్దంటూ 44 సంఘాల సభ్యులు మూకుమ్మడిగా తీర్మానించారు. వెలుగు అధికారుల సమక్షంలో చేతులెత్తి నూతన అధ్యక్షురాలిగా సాకేటి పూర్ణిమను ఎన్నుకున్నారు. ఈ అధ్యక్ష పదవికి ఇటీవల వచ్చిన ఆరోపణలపై శనివారం ఆరికతోట సచివాలయ ఆవరణలో ఎపిఎం అన్నపూర్ణ ఆధ్వర్యంలో బహిరంగ విచారణ చేపట్టారు. మొత్తం 67 సంఘాలకు గాను 47 సంఘాలు విచారణకు హాజరైతే, అరుణ అభ్యర్థిత్వాన్ని 3 సంఘాలు మాత్రమే సమర్ధించాయి. ఇటీవల అరుణను ఇదే వ్యతిరేకత కారణంగా తొలగించారు. ఆమె ఎపిఎం అన్నపూర్ణ, బుక్ కీపర్ రేజేటి బాలమ్మపై కలెక్టర్ గ్రీవెన్స్, వెలుగు ఎసిలకు ఫిర్యాదు చేశారు. వారి ఆదేశాలతో విచారణ చేయాల్సి వచ్చినట్లు ఎఫ్‌పిఒ ఎపిఎం సత్యనారాయణ తెలిపారు. ఈ సందర్భంగా స్త్రీనిధి మేనేజర్ రమేష్ మాట్లాడుతూ సంఘం తీర్మానాల ప్రాతిపదికనే నియామకాలకు ప్రాధాన్యత ఇస్తామని స్పష్టంచేశారు. అనంతరం నూతన అధ్యక్షురాలిగా పూర్ణిమ, సెక్రటరీగా పూసర్ల గున్నమ్మ ఎన్నికైనట్లు ప్రకటించారు. కార్యక్రమంలో ఎలొసి దేముడుబాబు, సిసి సింగరాజు పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

ప్రజాశక్తి-శృంగవరపుకోట

అధికారులంతా సమన్వయంతో పనిచేయాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు అన్నారు. స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి సండి సోమేశ్వరావు అధ్యక్షతన శనివారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలో పలు సమ్యసలపై చర్చించారు. ముందుగా ఎన్‌ఆర్‌ఇజిఎస్ ద్వారా మంజూరైన పనుల మొదటి జాబితాలో 22 పనులు ఇంకా ఎందుకు ప్రారంభం కాలేదని, మండల తీర్మానం చేసి ఇచ్చినా ఎందుకు మంజూరు చేయలేదని పిఆర్ జెఇ సత్యనారాయణను ఎమ్మెల్సీ ప్రశ్నించారు. ఆ పనులు ఇంకా భువన యాప్‌లోకి రాలేదని, రాగానే పనులు మంజూరు అవుతాయని జెఇ తెలిపారు. అనంతరం పలువురు సర్పంచులు తమకు తగిన గౌరవం ఇవ్వడం లేదని ప్రస్తావించారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ మండలంలో ప్రతీ అధికారి ఆయా పంచాయతీలకు సంబంధించి ఏ విషయంలోనైనా ముందుగా సర్పంచ్, ఎంపిటిసిలకు సమాచారం ఇవ్వాలని సూచించారు. అందరినీ సమన్వయం చేసుకొని వెళ్లాలని అధికారులను ఆదేశించారు. దారిపర్తి గ్రామంలో ఉపాధి హామీ పనులు చేపట్టడం లేదని, వెంటనే అక్కడ పనులు ప్రారంభించాలని ఎపిఒ రమ్యకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టూరిజం బోర్డు డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి, వైస్ ఎంపిపి పినిశెట్టి వెంకటరమణ, ఇఒపిఆర్‌డి లక్ష్మి, తహశీల్దార్ అరుణకుమారి, ఎలక్ట్రికల్ ఎఇ రవి, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారి ఝూన్సీ, అన్ని శాఖల మండల స్థాయి అధికారులు, పంచాయతీల సెక్రటరీలు తదితరులు పాల్గొన్నారు.

సర్వసిద్ధి'కి ఉగాది పురస్కారం

ప్రజాశక్తి-బొబ్బిలి

బొబ్బిలివీణ తయారీ కళాకారుడు సర్వసిద్ధి సూర్యప్రకాశ రావు రాష్ట్ర ఉగాది పురస్కారానికి ఎంపికయ్యారు. బొబ్బిలిలోని గొల్లపల్లిలో ఉన్న వీణల తయారీ కేంద్రంలో పనిచేస్తున్న ఆయన ఉగాది సందర్భంగా కళారత్న (హంస) అవార్డుకు ఎంపికయ్యారు. ఈ మేరకు రాష్ట్ర పర్యాటక శాఖ నుంచి శనివారం ఉత్తర్వులు వెలువడ్డాయి.

నాణ్యమైన విద్యా బోధన చేయాలి

ప్రజాశక్తి-బొబ్బిలి

ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యను బోధించాలని ఎమ్మెల్యే బేబినాయన కోరారు. పట్టణంలో ఉన్న ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలలో శనివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులు, ఉపాధ్యాయులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. చిన్న ప్లేట్లలో విద్యార్థులు భోజనం చేయడంతో చూసిన బేబినాయన ఒకేలాంటి భోజనం ప్లేట్లు అందిస్తానని హామీ ఇచ్చారు.

ఎమ్మెల్యే ఆదేశాలంటే ఖాతరు లేదా?

కౌన్సిల్ సమావేశంలో మండిపడ్డ టిడిపి కౌన్సిలర్లు

ప్రజాశక్తి-బొబ్బిలి

మున్సిపాలిటీలో ఎమ్మెల్యే బేబినాయన సూచించిన అభివృద్ధి పనులు చేయకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని, ఎమ్మెల్యే ఆదేశాలంటే ఖాతరు లేదా? అని టిడిపి కౌన్సిలర్ రాంబార్కి శరత్ అధికారులను ప్రశ్నించారు. మున్సిపల్ కార్యాలయంలో శనివారం చైర్మన్ సావు వెంకట మురళీకృష్ణ అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తాండ్ర పాపారాయ విగ్రహ జంక్షన్ సుందరీకరణ చేయాలని, శాఖా గ్రంథాలయ భవనం ప్రారంభానికి ముహూర్తం ఖరారు చేయాలని, పలు అభివృద్ధి పనులు చేయాలని ఎమ్మెల్యే సూచనలు చేస్తే కనీసం పట్టించుకోకపోవడం అన్యాయమని శరత్ అన్నారు. కొన్ని నెలల క్రితం తాండ్ర పాపారాయ విగ్రహం జంక్షన్ సుందరీకరణ చేయాలని కోరితే ఇప్పుడు నిధులు కేటాయించినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్యే చెప్పిన పని చేయొద్దని ఎవరు ఒత్తిడి తెస్తున్నారని మున్సిపల్ అధికారులను టిడిపి కౌన్సిలర్లు ప్రశ్నించగా, వైసిపి కౌన్సిలర్లు అభ్యంతరం చెప్పారు. దీంతో ఇరువురి మధ్య స్వల్ప వాగ్వివాదం చోటుచేసుకుంది. వీధి దీపాల నిర్వహణకు రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నా సక్రమంగా వెలగడం లేదని పలువురు ప్రశ్నించారు. మున్సిపల్ అధికారులు బాధ్యతగా పని చేయాలని కోరారు. వైస్ చైర్మన్ చెలికాని మురళి మాట్లాడుతూ తాగునీరు సంపూర్ణంగా అందించి, అభివృద్ధి పనులు చేసి కౌన్సిల్‌కు మంచి పేరు తేవాలని కోరారు. కుళాయి కనెక్షన్లు ఇవ్వకపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, కుళాయి పన్ను డబుల్ ఎంట్రీలు ఉన్నాయని సరి చేయాలని వైసిపి కౌన్సిలర్ బొత్స రమణమ్మ కోరారు. కుళాయి లేకుండా పన్నులు ఎలా వేశారని వైసిపి కౌన్సిలర్ తెంటు పార్వతి ప్రశ్నించారు. అనంతరం పలు అభివృద్ధి పనులకు కౌన్సిల్ ఏకగ్రీవంగా ఆమోదించింది. సమావేశంలో కమిషనర్ రామలక్ష్మి, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.



జాబ్‌మేళా లో పాల్గొన్న ఎమ్మెల్యే బేబినాయన

ఉపాధి అవకాశాల కల్పనకు ప్రాధాన్యత

ప్రజాశక్తి-బొబ్బిలి

నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రాధాన్యత ఇస్తున్నట్లు ఎమ్మెల్యే బేబినాయన తెలిపారు. స్థానిక రాజా కళాశాలలో శనివారం జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో మెగా జాబ్‌మేళా నిర్వహించారు. జాబ్ మేళాను బేబినాయన ప్రారంభించారు. జాబ్ మేళాకు 21 కంపెనీల ప్రతినిధులు హాజరయ్యారు. 1312 మంది ఇంటర్వ్యూలకు హాజరుకాగా, 375 మందిని ఉద్యోగాలకు ఎంపిక చేసినట్లు ప్రిన్సిపల్ వీరేంద్ర కుమార్, ప్లేస్మెంట్ అధికారి శరత్ చెప్పారు. మరో 53 మందిని ఫైనల్ రౌండ్ కు ఎంపిక చేశారన్నారు.

తాగునీటి సమస్యలపై కంట్రోల్‌రూమ్

ప్రజాశక్తి-వేపాడ

వేసవిలో తాగునీటి సమస్యలపై ఫిర్యాదులను స్వీకరించేందుకు ఎంపిడిఒ కార్యాలయంలో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసినట్లు మండల ప్రత్యేకాధికారి లక్ష్మీనారాయణ తెలిపారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో ఆయన సమీక్షించారు. మండలంలో నీటి ఎద్దడి లేకుండా చూడాలని అధికారులకు సూచించారు. సచివాలయ పరిధిలో మంచినీటి సరఫరా సక్రమంగా జరుగుతుందా? లేదా? అని చూడాల్సిన బాధ్యత ఇంజినీరింగ్ అసిస్టెంట్‌పై ఉందని స్పష్టంచేశారు. నీటి సరఫరాలో సమస్య ఏర్పడితే సర్పంచ్, పంచాయతీ కార్యదర్శితో చర్చించి, పరిష్కరించాలని ఆదేశించారు. తాగునీటి బోర్లకు వెంటనే మరమ్మతులు పూర్తిచేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ వి.దేవిని ఆదేశించారు. మండలంలో 16 పశువుల తొట్టెలు ఏర్పాటు చేసేందుకు స్థల పరిశీలన చేయాలని ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ, పశువైద్యాధికారిని ఆదేశించారు. సమావేశంలో తహశీల్దార్ జె.రాములమ్మ, ఎంపిడిఒ సిహెచ్ సూర్యనారాయణ, ఎపిఒ ఆదిలక్ష్మి, ఎంఇఒ పి.బాలభాస్కరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి లక్ష్మీనారాయణ

బోరుకు మరమ్మతులు

ప్రజాశక్తి-వేపాడ

మండలంలోని సింగరాయి ఎస్‌సి కాలనీలో తాగునీటి బోరుకు శనివారం మెకానిక్ అచ్చెన్నాయుడు మరమ్మతులు చేశారు. బోరు పాడైపోవడంతో నాలుగు రోజులుగా నీరందడం లేదని ఎంపిడిఒ కార్యాలయంలో కాలనీవాసులు ఫిర్యాదుచేశారు. దీంతో శనివారం బోరు మెకానిక్ వచ్చి బాగుచేశారు.

అధికారుల తీరుపై మండిపడ్డ సభ్యులు

ప్రజాశక్తి-మెంటాడ

వ్యవసాయ, ఆర్‌డబ్ల్యుఎస్, ఉపాధి హామీ, గృహనిర్మాణ, తదితర శాఖల అధికారుల పనితీరు పట్ల మండల సభ్యులు మండిపడ్డారు. శనివారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాఖల వారీగా ప్రగతి నివేదికలను అధికారులు వివరించారు. ఇద్దనవలస సర్పంచ్ రాయిపల్లి రామారావు మాట్లాడుతూ రక్షిత తాగునీటి పథక నిర్వహణ బాధ్యతలను కాంట్రాక్టరుకు అప్పగించడం, విద్యుత్తు బిల్లులు అధికం కావడం, సర్పంచ్‌ను సంప్రదించకుండా వారి జీతభత్యాలు చెల్లించడం పట్ల ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇ నవీన్‌ను ప్రశ్నించారు. మూడేళ్ల కిందట జరిగిన విషయాన్ని అడిగితే ఏం సమాధానం చెప్తానని ఎఇ వివరణ ఇచ్చారు. పైపులైన్ల మరమ్మతులు చేయడానికి లేని శ్రద్ధ ప్రజాధనం వృథా చేయడానికి ఎలా ఉంటుందని సర్పంచ్ తిరిగి ప్రశ్నించారు. వ్యవసాయ శాఖ అధికారి గోకులకృష్ణ పనితీరు పట్ల సభ్యులు అసంతృప్తి వ్యక్తంచేశారు. ప్రజాప్రతినిధులను గౌరవించకుండా ఇష్టానుసారంగా విధులు నిర్వహిస్తున్నారని ఆరోపించారు. గహ నిర్మాణ బిల్లుల జాప్యంపై సభ్యులు ప్రశ్నించారు. ఉపాధి హామీ పనులు కల్పించక పోవడంతో కూలీలు వలసబాట పడుతున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. సుమారు పది వారాలుగా చేసిన పనులకు బిల్లులు మంజూరు కాకపోవడంతో కూలీలు లబోదిబోమంటున్నారని ఎపిఒ చిన్నప్పయ్యను ప్రశ్నించారు. ప్రతిశాఖలో లోటుపాట్లను సభ్యులు ఎండగట్టారు. కార్యక్రమంలో ఎంపిడిఒ భానుమూర్తి, తహశీల్దార్ కె.శ్రీనివాసరావు, జెడ్‌పిటిసి లెంక సన్యాసప్పలనాయుడు, వైస్ ఎంపిపిలు సారిక ఈశ్వరరావు, టి.దుర్గ, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి కూలీల సమస్యలపై 1న ధర్నా

ప్రజాశక్తి - శృంగవరపుకోట

ఉపాధి కూలీల సమస్యలపై ఏప్రిల్ ఒకటో తేదిన కలెక్టరేట్ వద్ద చేపట్టే ధర్నాను జయప్రదం చేయాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గాడి అప్పారావు, సిఐటియు జిల్లా కార్యదర్శి మద్దిల రమణ కోరారు. శనివారం మండలంలోని అమ్మ చెరువులో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలతో వారు మాట్లాడారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పని ప్రదేశాల్లో మౌలిక సౌకార్యల్లేకపోవడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. అలాగే రెండుపూటలా పనుల వల్ల కూలీలు తీవ్ర అవస్థలుపడుతుఆన్నరన్నారు. ఈ సమస్యలపై చేపట్టే ధర్నాను విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సిహెచ్ జ్యోతి, ఎల్.వరలక్ష్మి, జి.దేవి, పి.రాధిక, గాయత్రి, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి పనులు పరిశీలన

ప్రజాశక్తి - సీతానగరం

మండలంలోని పనుగుపేట గ్రామంలో జరుగుతున్న ఉపాధి పనులను ఎంపిడిఒ పి.త్రివిక్రరావు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన కూలీల మస్తర్లను తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫీల్డ్ అసిస్టెంట్ ఉష, ఉపాధి కూలీలు పాల్గొన్నారు.

పారిశుధ్య కార్మికులకు దుస్తులు పంపిణీ

సీతంపేట: ఉగాది పర్వదినం పురస్కరించుకొని సీతంపేట గ్రామపంచాయతీలో పనిచేస్తున్న పారిశుధ్య కార్మికులందరికీ నూతన వస్త్రాలను పంచాయతీ ద్వారా సర్పంచ్ ఆరిక కళావతి, ఎంపిడిఒ గీతాంజలి చేతుల మీదుగా శనివారం పంపిణీ చేశారు. పంచాయతీకి మంచి పేరు గుర్తింపు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు హేమరిక పవన్ కుమార్, పాల్గొన్నారు.

ముగిసిన కైలాసనాథ యాత్ర

గుమ్మలక్ష్మీపురం: మండల కేంద్రంలో నిర్వహిస్తున్న ఉమా సహిత కైలాసనాథ యాత్ర ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. యాత్రకు గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియ్యమ్మవలస, బత్తిలి, పార్వతీపురం తదితర ప్రాంతాల నుంచి వేలాది సంఖ్యలో ప్రజలు తరలి వచ్చారు. యాత్రలో జెయింట్ వీల్, డ్రాగన్ ట్రైన్ ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. గుమ్మలక్ష్మీపురం ప్రధాన రహదారి ఇరువైపులా ఏర్పాటు చేసిన విద్యుత్ కాంతులు అలంకరణ దగదగా మెరిసాయి.

సామాజిక తనిఖీలో బయటపడ్డ అవినీతి

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

మండలంలో 2023-24 సంవత్సరంలోని చేపట్టిన ఉపాధిహామీ పనులపై సామాజిక తనిఖీ నిర్వహించారు. ఈ మేరకు శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో నిర్వహించిన ప్రజావేదికలో డిఆర్‌సి సభ్యులు వెల్లడించిన నివేదికలో క్షేత్రస్థాయి సిబ్బంది పనితీరు అడుగడుగునా నిర్లక్ష్యం, అంతులేని బాధ్యతారాహిత్యం కనిపించింది. దీంతో డ్వామా పీడీ కె.రామచంద్రరావు అప్పటి ఎపిఒ, డిఎ, ఫీల్డ్ అసిస్టెంట్లపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. మండలంలోని 30 పంచాయితీల్లో ఆ ఏడాది రూ.26 కోట్ల 13 లక్షలతో నిర్వహించిన 2412 పనుల్లో ఎక్కడా క్షేత్రస్థాయి సిబ్బంది బాధ్యతాయుతంగా వ్యవహరించినట్లు కనిపించలేదు. దస్త్రాల నిర్వహణ, వేతనదారుల హాజరు, చేసిన పనులకు సంతకాలు వంటి ప్రాథమిక పనులు కూడా సక్రమంగా నిర్వహించలేదని ఆడిట్ బృందం ప్రజా వేదికకు వివరించింది. రహదారి పక్కన మొక్కలు, రైతులకు అందించిన హార్టికల్చరల్ పథకాల్లో ఎక్కడా సరైన పర్యవేక్షణ కనిపించలేదని, దీనివల్ల లక్షలాది రూపాయల ఖర్చుతో నిర్వహించిన పథకం లక్ష్యం నెరవేరలేదని స్టేట్ రిసోర్స్ పర్సన్ మాధవరావు తెలిపారు. దీంతో 30 పంచాయతీలకు చెందిన క్షేత్రస్థాయి సహాయకులకు భారీ ఎత్తున పెనాల్టీలను విధించారు. కార్యక్రమంలో ఎంపిపి మజ్జి శోభారాణి, ఎంపిడిఒ జివి రమణమూర్తి, డిఎల్‌డిఒ రాకేష్ రామన్ పాల్గొన్నారు.

ఫారం పాండ్ల పరిశీలన

మక్కువ: మండలంలోని మార్కొండ పుట్టి పంచాయతీ పాతగెశిలలో కేంద్రుక కృష్ణ, పొలం దొర పంట పొలాల్లో తవ్విన ఫారం పాండ్లను ఎంపిడిఒ డిడి స్వరూపారాణి శనివారం పరిశీలించారు. ఆమె వేతనదారులతో మాట్లాడుతూ భూగర్భ జలాలు పెరగడానికి ఫారం పాండ్లు ఎంతగానో ఉపయోగప డతాయని అన్నారు. ప్రతి రైతు తమ వ్యవసాయ క్షేత్రంలో తప్పనిసరిగా ఫారం పాండ్లను తీసుకోవాలని సూచించారు. ఎపిఒ ఈశ్వరమ్మ, ఫీల్డ్ అసిస్టెంట్ కోన అప్పారావు పాల్గొన్నారు.

ఒబి ఎంఎంఎస్ ఇంటర్వ్యూలు

బిసి కార్పొరేషన్ రుణాలకు దరకాస్తు చేసుకున్న వారు ఏప్రిల్ 3న ఉదయం 10 గంటల నుంచి స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ భవనంలో ఇంటర్వ్యూలు జరుగుతాయని ఎంపిడిఒ డిడి స్వరూపరాణి తెలిపారు. మార్కొండపుట్టి, మక్కువ, శంబరలో పంచాయతీలకు సంబంధించిన దరఖాస్తుదారులు మధ్యాహ్నం 2గంటలకు హాజరు కావాలన్నారు. మిగతా 18 గ్రామపంచాయతీల వారు ఉదయం 10 గంటలకు ఒరిజినల్ ధ్రువపత్రాలతో హాజరు కావాలని సూచించారు.

రంజాన్ తోఫా అందించిన ఎమ్మెల్యే

కురుపాం: కురుపాంలో గల శివన్నపేట జామియా మసీదులో ముస్లిం సోదరులకు ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి శనివారం సాయంత్రం ఇఫ్తార్ విందును ఇచ్చి ముస్లిం కుటుంబాలకు రంజాన్ తోఫాను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండల టిడిపి కన్వీనర్ కెవి కొండయ్య, ఎఎంసి మాజీ చైర్మన్ కోలా రంజిత్, కూటమి నాయకులు కర్రి శ్రీను, చందకు రామకృష్ణ, బలగ రామకృష్ణ, ఆకుల రమేష్, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్



మాట్లాడుతున్న డిఎంహెచ్ఒ భాస్కరరావు

వేసవి దృష్ట్యా ప్రజారోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు జిల్లా వైద్యారోగ్యశాఖ అధికారి డాక్టర్ ఎస్.భాస్కరరావు తెలిపారు. ఆరోగ్య కార్యాలయం నుంచి జూమ్ కాన్ఫరెన్స్ ద్వారా వైద్యాధికారులు, 108 సిబ్బందికి ఆయన శనివారం పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు కారణంగా ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తంగా ఉండాలన్నారు. మండల, గ్రామీణ స్థాయిలో సమన్వయ సమావేశాలు నిర్వహించి నివారణ చర్యలపై ముందస్తు కార్యాచరణ చేయాలన్నారు. వేసవిలో తలెత్తే అనారోగ్య సమస్యలు, ప్రమాద సంకేతాలు, డీహైడ్రేషన్, వడ దెబ్బ, హీట్ వేవ్స్‌పై పారా మెడికల్ సిబ్బంది, క్షేత్ర స్థాయి సిబ్బందికి రీ ఓరియంటేషన్ శిక్షణ ఇచ్చి అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ప్రాథమిక, గ్రామీణ ఆరోగ్య కేంద్రాల్లో ఒఆర్ఎస్ ప్యాకెట్లు సిద్ధంగా ఉంచాలని, ఎప్పటికప్పుడు వాటి లభ్యతను వైద్యాధికారులు పరిశీలించాలని ఆదేశించారు. 108 వాహనంలో కోల్డ్ ఐస్ ప్యాక్స్, ఒఆర్ఎస్ ప్యాకెట్లు ఉండేలా చూసుకోవాలని కోఆర్డినేటర్‌కు సూచించారు. ఆసుపత్రుల్లో విద్యుత్ అంతరాయం లేకుండా ఇన్వర్టర్, బ్యాటరీ పనితీరు గమనించాలన్నారు. చిన్నారులు, గర్భిణులు, వృద్ధులు, దీర్ఘకాలిక రోగుల పట్ల మరింత జాగ్రత్తలు అవసరమని వారి ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని సూచించారు. అధిక ఉష్ణోగ్రతల్లో శ్రమతో కూడిన పనులు చేయరాదని, ఎప్పటికప్పుడు నీరు, మజ్జిగ, నిమ్మరసం, ఒఆర్ఎస్, గ్లూకోజు, కొబ్బరి నీళ్లు, నీటి శాతం సమృద్ధిగా ఉన్న పండ్లు తీసుకోవాలని, మాంసాహారం, నూనె, తీపి పదార్థాలు, శీతల పానీయాలు తగ్గించాలని సూచించారు. జిల్లా నోడల్ అధికారి డాక్టర్ టి.జగన్ మోహనరావు వడదెబ్బ, డీహైడ్రేషన్ పై రీ ఓరియంటేషన్ కల్పించారు.

'ఎమ్‌పిని అవమానించడం తగదు'

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

ఇటీవల పార్లమెంటులో అరకు కాఫీ స్టాల్ ఏర్పాటులో అరకు ఎంపి తనూజారాణిని ఆహ్వానించకపోవడం గిరిజన ఎంపిని అవమానించడమేనని ఇది కూటమి ప్రభుత్వానికి తగదని మాజీ ఎమ్మెల్యే అలజంగి జోగారావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. అంతర్జాతీయంగా గుర్తింపు పొందిన అరకు కాఫీని అరకు కాఫీ స్టాల్ ఏర్పాటు చేసిన సందర్భంలో కేంద్ర మంత్రులు, కేంద్రంలోని ఎన్‌డిఎ కూటమి నాయకుల చేతుల మీదుగా రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి గిరిజన సహకార సంస్థ చైర్మన్ కిడారి శ్రావణ్ కుమార్‌లతో కలిసి పార్లమెంట్లో కాఫీ స్టాల్ ఏర్పాటు చేయడం శుభ పరిణామమే ఈ కార్యక్రమానికి అరకు ఎంపిని ఆహ్వానించక పోవడం అధికార ఎన్‌డిఎ కూటమి ప్రభుత్వం చేస్తున్న ప్రోటోకాల్ ఉల్లంఘన కాదా అని ప్రశ్నించారు. ఈ విషయంపై దేశ ప్రధాని, కేంద్రమంత్రులు, మేధావులు ఆలోచన చేయాలని, ఇటువంటివి పునరావృతం కాకుండా చూడాలని ఆయన కోరారు.

సర్వరోగాలకు అమృతాహారంతో పరిష్కారం

ప్రజాశక్తి- పార్వతీపురం

సమాజంలో మనుషులు ఎదుర్కొంటున్న అన్ని రోగాలకు అమృతాహారంతోనే పరిష్కారం లభిస్తుందని కర్షక మహర్షి హాస్పిటల్ ప్రయివేట్ లిమిటెడ్ అధినేత డాక్టర్ ద్వారపురెడ్డి రామ్మోహన్ రావు చెప్పారు. ఆయన ప్రజాశక్తితో మాట్లాడుతూ జీవం వున్న ఆహారమే మానవులు దీర్ఘాయువుకు దోహదపడుతుందని చెప్పారు. వండిన, చచ్చిన ఆహారం సర్వరోగాలకు మూల కారణమని చెప్పారు. పచ్చగడ్డి, పచ్చి ఆకులు, దుంపలు, గింజలు, పచ్చిముద్దలతో అమృతాహారం తయారు చేసుకోవచ్చునని చెప్పారు. పచ్చిపాలు, పచ్చి గుడ్డులో జీవం వుంటుందని చెప్పారు. ఆహారాన్ని బాగా నమలడం వల్ల ఉమ్మి అతి శక్తివంతమైన ఎంజైమ్ ఆహారంతో కలుస్తుందని అన్నారు. ప్రతి రోజు సాయంత్రం 4 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 8 గంటల వరకు ఉపవాసం వుండడం వల్ల శరీరం నవయవ్వనంగా మారుతుందని చెప్పారు.

అదనంగా పైపు లైను ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి - వీరఘట్టం

రక్షిత మంచినీటి పథకం నుంచి అదనంగా పైపులైన్లు ఏర్పాటు చేసి దుర్గపేట వీధికి తాగునీరు అందించాలని, ఆర్‌డబ్ల్యుఎస్ డిఇ జి.మధుసూదనరావు, మేజర్ పంచాయతీ ఇఒ బి.కోటేశ్వరరావుకు ఆదేశించారు. శనివారం మండల కేంద్రంలోని దుర్గపేట వీధి, మేజర్ పంచాయతీ కార్యాలయ ఆవరణలో ఉన్న రక్షిత మంచినీటి పథకాన్ని పరిశీలించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. గతంలో ఏర్పాటు చేసిన పైపు లైన్లపై సిసి రోడ్లు నిర్మించడం వల్ల ఎక్కడ సమస్య ఉందో గుర్తించలేకపోతున్నామని, ఒకవేళ వాటి మరమ్మతులు చేపట్టాలన్నా సిసి రహదారులను కొట్టవలసిన పరిస్థితి ఏర్పడు తుందని, అదనంగా వీధులకు డైరెక్ట్ గా పైప్ లైన్లు ఇచ్చి తాగునీరు సరఫరా చేయాలని సూచించారు. వేసవిలో తాగునీటి సమస్య లేకుండా పట్టణ ప్రజలకు పూర్తిస్థాయిలో తాగునీరు అందించాలని సిబ్బందిని ఆదేశిం చారు. ఈయనతోపాటు ఆర్‌డబ్ల్యుఎస్ సైట్ ఇంజినీర్ కె.పాపారావు, పంచాయతీ కార్యాలయ సిబ్బంది ఉన్నారు.

అగ్ని ప్రమాద బాధితురాలికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

ఇటీవల అగ్ని ప్రమాదానికి గురైన ముగడ జయమ్మకు సహాయం చేయమని జియల్‌పురం గ్రామదేవత గ్రూపు ద్వారా కోరిన వెంటనే గ్రామస్తులు ఆర్థిక సహాయాన్ని అందించారని సర్పంచ్ బొత్తాడ గౌరీ శంకర్రావు తెలిపారు. ఆయన మాట్లాడుతూ పంచాయతీ ప్రజలు చాలా ఔదార్యాన్ని ప్రదర్శిస్తున్నారని పంచాయతీలో ఎవరికి కష్టం వచ్చినా తక్షణమే సమాచారం అందించిన మేరకు తమకు తోచిన సహాయ సహకారాలను అందిస్తున్నారని అన్నారు. ఈ మేరకు గ్రూప్ సభ్యులు స్పందించి ఇచ్చిన విరాళాలను హెల్పింగ్ హాండ్స్ నుంచి రూ.22,800 ఆర్థిక సహాయం అందజేసినట్లు ఆయన వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ఉప సర్పంచ్ కిషోర్, వైశ్య సంఘాధ్యక్షులు హరి మాస్టర్, కాపు సంఘ అధ్యక్షులు మన్మథ, జనసేన అధికారి అనిల్, కొత్తకోట విష్ణు, శ్రీధర్, జగదీష్ హెల్పింగ్ హాండ్ సభ్యులు వినోద్, రాజా గ్రామ పెద్దలు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మహిళలకు చీరలు పంపిణీ

ప్రజాశక్తి - సీతానగరం

ఉగాది పండగ సందర్భంగా మండలంలోని నిడగల్లుకు చెందిన టిడిపి నేత బర్ల వెంకటరమణ గ్రామంలోని మహిళలకు 600 చీరలు పంపిణీ చేశారు. తెలుగుదేశం పార్టీ ఆవిర్భావ దినోత్సవంతో పాటు ఉగాది పండగను పురస్కరించుకొని ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు ఆయన తెలిపారు. ఇంటింటికీ వెళ్లి చీరలను మహిళలకు అందజేసినట్లు తెలిపారు.

ఆయనతో పాటు గ్రామంలోని పలువురు టిడిపి నాయకులు, అభిమానులు పాల్గొన్నారు. వెంకటరమణ సేవలను గ్రామస్తులు కొనియాడారు.

పలువురికి ఎమ్మెల్యే పరామర్శ

ప్రజాశక్తి - కురుపాం



బాధితులను పరామర్శిస్తున్న ఎమ్మెల్యే జగదీశ్వరి

మండల కేంద్రంలో అనారోగ్యంతో బాధపడుతున్న టిడిపి, జనసేన సీనియర్ నాయకుల కుటుంబ సభ్యులు లక్ష్మాపురం జోగినాయుడు, సింగిడి సీతారాం, నేరేడుబిల్లి రమణమ్మల ఇంటి వద్దకు ఎమ్మెల్యే జగదీశ్వరి శనివారం వెళ్లి పరామ ర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ధైర్యంగా ఉండి తొందరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కర్రి లక్ష్మమ్మ కుటుంబ సభ్యులను పరామర్శించి పార్టీ అండగా ఉంటుందని భరోసానిచ్చి ధైర్యాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులపై శిక్షణ

ప్రజాశక్తి - కురుపాం

మండలంలో కెవికె కృషి విజ్ఞాన కేంద్రం వద్ద శనివారం కెవికె ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ ఎస్. ధ్రువ, వ్యవసాయ పరిశోధన సంస్థ అధిపతి డాక్టర్ జ్యోతి బస్ ఆధ్వర్యంలో వేసవికాలంలో తీసుకోవలసిన వ్యవసాయ యాజమాన్య పద్ధతులపై శిక్షణ నిర్వహించారు. సందర్భంగా వేసవికాలంలో పంటలను చీడపురుగుల నుంచి కాపాడుకునే విధానం, పచ్చి రొట్టె ఎరువులు తయారు చేసే విధానం, భూమిని వేసవిలో సారవంతంగా తయారవ్వడానికి తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఎడిఎ నిర్మల జ్యోతి, వ్యవసాయ అధికారులు సిహెచ్ ప్రసాద్, జ్యోతి, వ్యవసాయ విస్తరణ అధికారులు, కెవికె సిబ్బంది పాల్గొన్నారు.

లబ్ధిదారుల ధ్రువపత్రాల పరిశీలన పూర్తి

ప్రజాశక్తి - కొమరాడ

రాష్ట్ర ప్రభుత్వం బిసి కార్పొరేషన్ ద్వారా పేదలను అభివృద్ధి చేసేందుకు కేటాయించిన సబ్సిడీ రుణాల దరఖాస్తు ధ్రువపత్రాల పరిశీలన పూర్తయిందని ఎంపిడిఒ ఎం.మల్లికార్జున రావు అన్నారు. శనివారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల పత్రాలను పరిశీలించారు. ఈ పరిశీలనకు ఎస్‌బిఐ, యూనియన్ బ్యాంక్, ఎపిజీవీబీ అసిస్టెంట్ మేనేజర్లు పాల్గొని లబ్ధిదారుల దరఖాస్తులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపిడిఒ మాట్లాడుతూ మండలంలోని 45 బీసీ కార్పొరేషన్ యూనిట్లకు గాను 234 దరఖాస్తుల ఆన్‌లైన్లో వచ్చినట్లు తెలిపారు. మూడు బ్యాంకుల పరిధిలో 45 యూనిట్లు రుణాలు మంజూరు చేస్తున్నట్లు తెలిపారు. ఆన్‌లైన్లో దరఖాస్తు చేసుకున్న లబ్ధిదారుల వివరాలను క్షేత్రస్థాయిలో ధ్రువీకరణ పత్రాలు పరిశీలన చేసి ఎంపిక ప్రక్రియ చేపడతామని అన్నారు. అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి నివేదికలను ఆయా బ్యాంకులకు, ఉన్నతాధికారులకు పంపించి రుణాల మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో మండల పరిషత్ కార్యాలయం, బ్యాంకు సిబ్బంది, లబ్ధిదారులు పాల్గొన్నారు.

రోడ్డుకు మరమ్మతులు చేపట్టాలి

కొమరాడ : గతంలో మరమ్మతులు చేయగా మిగిలిపోయిన అంతరాష్ట్ర రహదారిపై మరమ్మతు పనులు పూర్తి చేయాలని సిపిఎం నాయకులు కె.సాంబమూర్తి డిమాండ్ చేశారు. మండలంలోని కోటిపాం, స్వామినాయుడువలస, ఆర్తాం రైల్వే గేట్ సమీపాన గల రోడ్డు మరమ్మతులకు గురైన ప్రదేశాన్ని శనివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ అంతరాష్ట్ర రహదారిపైన మిగతా 20 శాతం మరమ్మతు పనులు ఎప్పుడు చేపడతారని ప్రశ్నించారు. ఈ పనులు చేయకపోవడంతో మూడు రాష్ట్రాల వెళ్లే వాహనదారులు, ప్రయాణికులు అనేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. ఈ పనులు వదిలేయడంతో మళ్లీ పరిస్థితి యధాస్థితికి గోతులు పడే ప్రమాదం ఉందని అన్నారు. కావున తక్షణమే అధికారులు స్పందించి మిగిలిన రోడ్డు పనులను పూర్తి చేసి వాహనదారులకు, ప్రయాణికులకు భరోసా కల్పించాలని కోరారు.

ప్రజాశక్తి 7
ఆదివారం 30 మార్చి 2025

డ్రోన్లతో మాదక ద్రవ్యాల నియంత్రణ : కలెక్టర్

ప్రజాశక్తి - పార్వతీపురం

జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు డ్రోన్లు వినియోగించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా మాదక ద్రవ్యాల నియంత్రణ కమిటీ సమావేశం శనివారం కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా మాదక ద్రవ్యాల రహిత జిల్లాగా ఉండాలన్నారు. నాటు సారా తయారీ సైతం ఉండకుండా పక్కాగా పర్యవేక్షణ జరగాలని స్పష్టం చేశారు. అసైన్డ్ భూముల్లో ఎవరైనా నాటు సారా తయారు చేస్తే పట్టాలు రద్దు చేస్తామని హెచ్చరించారు. నవోదయం కార్యక్రమంలో భాగంగా పెద్ద ఎత్తున అవగాహన కల్పించాలని ఎక్సైజ్ శాఖను ఆదేశించారు. ఎఅటవీ ప్రాంతంలోను నాటు సారా తయారీ వంటి అసాంఘిక కార్యక్రమాలు జరగకుండా పర్యవేక్షణ జరగాలని అటవీశాఖ అధికారిని ఆదేశించారు. మందుల దుకాణాల్లో వివిధ రూపాల్లో, కాలం చెల్లిన మందుల విక్రయాలు జరిగితే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని ఆదేశించారు. ప్రైవేట్ ఆసుపత్రుల్లో మందుల వినియోగం రిజిస్టర్ పక్కాగా ఉండాలని చెప్పారు. ఎస్‌పి ఎస్‌వి మాధవ రెడ్డి మాట్లాడుతూ ప్రతి రోజు డ్రోన్ ద్వారా పర్యవేక్షణ చేస్తున్నామని తెలిపారు. జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అధికారి డి.ఆశా మాట్లాడుతూ పార్వతీపురం పట్టణంలో నాలుగు మందుల దుకాణాలపై దాడులు నిర్వహించామని, మూడు దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా విక్రయాలు జరపడాన్ని గుర్తించామని, వాటి లైసెన్స్‌లను రద్దు చేశామని తెలిపారు. జిల్లా ఎక్సైజ్ అధికారి త్రినాథరావు మాట్లాడుతూ ఒడిశా అధికారులతో కలిసి సంయుక్త తనిఖీలు నిర్వహించేందుకు సమన్వయం చేస్తున్నామని ఆయన తెలిపారు. అనంతరం ఈగల్ టీమ్ అవగాహన కార్యక్రమాలపై రూపొందించిన పోస్టర్లను విడుదల చేశారు.



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ శ్యామ్‌కుమార్, ఎస్‌పి మాధవరెడ్డి, అధికారులు

హెల్మెట్ వాడకం తప్పనిసరి

ప్రాణ రక్షణకు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ అన్నారు. జిల్లా రహదారి భద్రత కమిటీ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ప్రమాదాలు జరగకుండా పటిష్ట భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. హెల్మెట్ తప్పనిసరి అని, పట్టణం బయట వాహనాలు నడిపేవారిపై దృష్టి సారించాలని తెలిపారు. ప్రమాదాలు జరిగే స్థలాలను గుర్తించి అక్కడ అవసరమయ్యే మౌలిక సదుపాయాలు కల్పించాలని సూచించారు. రహదారి భద్రతపై విద్యా సంస్థలతో పాటు వివిధ రంగాల్లో వ్యక్తులకు అవగాహన కల్పించాలని స్పష్టం చేశారు. ఎస్‌పి ఎస్‌వి మాధవరెడ్డి మాట్లాడుతూ రహదారి భద్రతపై అన్ని శాఖలు సమన్వయంతో పని చేస్తున్నాయని తెలిపారు. సమావేశంలో ఎఎస్ పి అంకిత సురానా, డిఎఫ్‌ఒ జిఎపి ప్రసూన, డిప్యూటీ కలెక్టర్ డాక్టర్ పి ధర్మచంద్రా రెడ్డి, పాలకొండ డిఎస్‌పి ఎం.రాంబాబు, జిల్లా రవాణా అధికారి టి దుర్గాప్రసాద్ రెడ్డి, వివిధశాఖల అధికారులు పాల్గొన్నారు.

శాశ్వత లోక్ అదాలత్ పై అవగాహన సదస్సు

రెండవ అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు

ప్రజాశక్తి - పార్వతీపురంటౌన్

ప్రజా ప్రయోజన సేవలకు సంబంధించి, శాశ్వత లోక్ అదాలత్ ఆవశ్యకత, సామర్థ్యం పెంపుదల, కేసుల పరిష్కార విధానం, వివాదాలను పరిష్కరించే అధికారం శాశ్వత లోక్ అదాలత్‌కు ఉందని, వాటిని వినియోగించుకోవాలని స్థానిక రెండో అదనపు జిల్లా జడ్జి ఎస్.దామోదరరావు పేర్కొన్నారు. శనివారం జిల్లా కోర్టు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన పారా లీగల్ వాలంటీర్ల శిక్షణా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నీరు, విద్యుత్ సరఫరా, పోస్టల్, టెలిఫోన్ సేవల్లోని వివాదాలు, పారిశుధ్యం, ప్రజా సంరక్షణ సేవల్లో సమస్యలు, బ్యాంకులు, ఇతర ఆర్థిక లావాదేవీలు జరిపే సంస్థల్లోని వివాదాలను పరిష్కరించే అధికారం శాశ్వత లోక్ అదాలత్‌కు ఉందని వివరించారు. ఆసుపత్రులు, డిస్పెన్సరీల సేవల వల్ల వచ్చే వివాదాలు, భీమా సంస్థల్లో వివిధ కారణాలోల్ల ఏర్పడే సమస్యలను శాశ్వత లోక్ అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునని సూచించారు. శాశ్వత లోక్ అదాలత్ అధ్యక్షునిగా జిల్లా జడ్జి స్థాయి అధికారి ఉంటారని, ఆయనతో పాటు ఇద్దరు సభ్యులు ఉంటారని అన్నారు. కక్షిదారుడు లోక్ అదాలత్‌కు దరఖాస్తు చేసుకుంటే ఎటువంటి రుసుం చెల్లించకుండా సమస్యను పరిష్కరించుకోవచ్చునన్నారు. ఇరుపక్షాలు అంగీకారమైన తీర్పు ఇవ్వడం జరుగుతుందని, కక్షిదారులు రాజీ షరతులకు అంగీకరించకుంటే న్యాయస్థానాల మాదిరిగానే తీర్పు ఇస్తామని పేర్కొన్నారు. శాశ్వత లోక్ అదాలత్ ఇచ్చే తీర్పు అంతిమమని, దీనిపై అపీల్ చేసుకునే అవకాశం ఉండదన్నారు. ఈ సందర్భంగా పారా లీగల్ వాలంటీర్లు చేయాల్సిన విధివిధానాలను వివరించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు టి. జోగారావు, ప్రభుత్వ సహాయ అడ్వకేట్ బి.సత్యనారాయణ, సీనియర్ అడ్వకేట్ యం.వి. రమణ, జూనియర్ అడ్వకేట్ ఏ.లక్ష్మీపతిరాజు, పారా లీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

కురుపాం : స్థానిక కోర్టులో లోక్ అదాలత్‌పై పారా లీగల్ వాలంటరీలకు మండల న్యాయ సేవా సాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయవాది గంటా రాజకుమార్ అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళ, గిరిజన చట్టాలు, న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించి గ్రామస్థాయిలో ప్రజలకు న్యాయ వ్యవస్థపై అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో లోక్ అదాలత్ సభ్యులు జి.వెంకటరావు, న్యాయ సేవాధికార సంస్థ సిబ్బంది పాలకొల్లు శ్రీనివాస్, పారా లీగల్ వాలంటీర్లు పాల్గొన్నారు.

ఆర్మీ అధికారిగా శ్రీవాత్సవ్ ఎంపిక

ప్రజాశక్తి - పాలకొండ

పట్టణంలోని ఎంఎం నగర్‌కు చెందిన పి.శ్రీవాత్సవ్ ఆర్మీ అధికారిగా ఎంపికయ్యారు. ప్రపంచంలోనే అత్యంత కఠినమైన ఇంటర్వ్యూల్లో ఒకటైన ఎస్ఎస్‌బిలో ఉత్తీర్ణుడై అద్భుతమైన ఘనత సాధించాడు. చెన్నైలోని ప్రతిష్టాత్మక ఆఫీసర్స్ ట్రైనింగ్ అకాడమీలో చేరబోతున్నాడు. లెఫ్టినెంట్‌గా - ఐఎఎస్ అధికారికి సమానమైన, గౌరవనీయమైన ర్యాంక్ ఈ పోస్టు ద్వారా రానుంది. ఇంటర్ వరకు విజయనగరం కోరుకొండ సైనిక్ స్కూల్లో చదువుకొని ఇంజినీరింగ్ రాజాం జిఎంఆర్‌లో పూర్తి చేశారు. ఆపై శిక్షణకు ఇతర ఇతర రాష్ట్రాలకు వెళ్లి ఈ పోస్ట్‌ను సంపాదించారు. శ్రీవాస్తవ తండ్రి సింహాచలం స్పెషల్ బ్రాంచ్ హెడ్ కానిస్టేబుల్‌గా విధులు నిర్వహిస్తున్నారు. శ్రీవాత్సవ్ ఆర్మీ ఆఫీసర్ కావడం పట్ల అటు గ్రామస్తులు, తోటి స్నేహితులు, తల్లిదండ్రులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

అటవీ ఉత్పత్తుల కొనుగోలు వేగవంతం

ప్రజాశక్తి - పార్వతీపురం

స్థానిక ఐటిడిఎ పరిధిలోని జిసిసి కొనుగోలు కేంద్రాల ద్వారా అటవీ వ్యవసాయ ఉత్పత్తుల కొనుగోళ్లను వేగవంతం చేసినట్లు పిఒ అశుతోష్ శ్రీవాస్తవ పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జిసిసి ద్వారా కొనుగోళ్లు చేస్తున్న చింతపండు, కొండచీపుర్లు, పిక్క తీసిన చింతపండు, ముసిడిక పిక్కలు, అడవి తేనె, విప్ప పప్పు, మారేడుగడ్డలు, కరక్కాయలు, కుంకుడుకాయలు, ఎండు ఉసిరి మొదలగు అటవీ ఉత్పత్తులన్నీ గతేడాది కంటే జిసిసి ధరలు పెంచిందన్నారు. దీన్ని గిరిజన రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అలాగే ఈ ఏడాది సీజనుకు ముందే గిరిజన గ్రామాల్లో కరపత్రాలు, పత్రికలు, అవగాహన సదస్సుల ద్వారా జిసిసి ద్వారా అందిస్తున్న ధరలు గురించి తెలియజేసినట్లు చెప్పారు ఎప్పటికప్పుడు పెరిగిన ధరలు గిరిజనులకు తెలియజేస్తున్నామని, ప్రభుత్వం ప్రకటించిన కిలో చింతపండు మద్దతు ధర రూ.32.40పై నుంచి రూ.36గా నిర్ణయించినట్లు వెల్లడించారు. ఇంత వరకు పార్వతీపురం డివిజన్ పరిధిలో సుమారు రూ.1.75 కోట్ల అటవీ ఉత్పత్తులను కొనుగోళ్లు చేశామని, ఇంకా కొనుగోలు చేయాల్సి ఉందని తెలిపారు.

ప్రభుత్వం నిర్ణయించిన ధరలకే గిరిజన అటవీ ఉత్పత్తులు కొనుగోళ్లు : జిసిసి డిఎం

గతేడాది కంటే ఈ ఏడాది అన్ని రకాల అటవీ వ్యవసాయ ఉత్పత్తులను వైస్ చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్, ఐటిడిఎ పిఒను సంప్రదించి ధరలు పెంచినట్లు జిసిసి డివిజనల్ మేనేజర్ వి.మహేంద్ర కుమార్ తెలిపారు. చింత పండు ఈ ఏడాది రూ.32.40 ఉండగా, దాన్ని ప్రస్తుతం ప్రభుత్వం నిర్ణయించిన మద్దతు ధర ప్రకారం రూ.36కు పెంచి కొనుగోలు చేస్తున్నామని అన్నారు. ఇప్పటివరకు 2,650 క్వింటాల పిక్క చింతపండు, 207 క్వింటాళ్ల పిక్క తీసిన చింతపండును కొనుగోళ్లు చేశామని తెలిపారు. ఇంకా గిరిజనుల వద్ద నున్న చింతపండు ఏప్రిల్ 15 వరకు కొనుగోలు చేయనున్నట్లు వివరించారు. మైదాన ప్రాంత ప్రజల గృహావసరాల నిమిత్తం మేలురకం చింతపండు అధిక ధరలు ఇచ్చి కొనుగోలు చేస్తున్నారని, అందువల్ల గిరిజనులు పెద్ద చింత పండును వేరుచేసి ఎక్కువ ధరకు విక్రయిస్తున్నారని తెలిపారు. తద్వారా కొంతమేర ఆదాయం పెరగనుందని ఆయన తెలిపారు.

నేడు ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

జిల్లాలో శ్రీవిశ్వావసు నామ సంవత్సర ఉగాది వేడుకలను ఆదివారం ఉదయం 9 గంటలకు లయన్స్ క్లబ్‌లో నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. ఉగాది వేడుకలపై సంబంధిత శాఖాధికారులతో శనివారం టెలి కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగు సంప్రదాయం ఉట్టిపడేలా మామిడి తోరణాలు, అరటి చెట్లతో అలంకరణలు ఉండాలని అన్నారు. వేదిక లోపల, వెలుపల ప్రభుత్వ చిహ్నంతో ఫ్లెక్సీ బ్యానర్లను ఏర్పాటు చేయాలని సూచించారు. శ్రీ విశ్వావసు నామ సంవత్సర ఉగాదిని పురస్కరించుకొని మంగళ వాయిద్యాలు, పంచాంగ శ్రవణం, వేద పండితుల ఆశీర్వచనం, ఉగాది పచ్చడి, పులిహోర వంటి సంప్రదాయ ప్రసాదాల ఏర్పాట్లను దేవాదాయ శాఖ అధికారులు బాధ్యతగా తీసుకోవాలని తెలిపారు. జిల్లా మంత్రి, ఇతర ప్రజా ప్రతినిధులను ఆహ్వానించినట్టు చెప్పారు. సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని ఆయన ఆదేశించారు. పంచాంగ శ్రవణం, కవి సమ్మేళనంలో పాల్గొన్న కవులకు ఘనంగా దుస్సాలువ, జ్ఞాపికతో సత్కరించాలన్నారు. ఉగాది వేడుకలకు జిల్లా అధికారులు అంతా సంప్రదాయ దుస్తులతో హాజరు కావాలని సూచించారు. రెడ్‌క్రాస్, లయన్స్ క్లబ్ సభ్యుల భాగస్వామ్యం సంతోషదాయకం అన్నారు. అందరూ ఆహ్వానితులే అని, అందరూ హాజరై విజయవంతం చేయాలని ఆయన కోరారు.

ఎనిమిది మంది అర్చకులకు సత్కారం

దేవాదాయ, ధర్మాదాయశాఖ ఆధ్వర్యంలో 65 సంవత్సరాల వయస్సు దాటిన 8 మంది అర్చకులకు సత్కారం, నగదు పారితోషికాన్ని ఆ శాఖ నిర్వహిస్తోందని జిల్లా కలెక్టర్ చెప్పారు. సమీక్షా సమావేశంలో డిఆర్‌ఒ కె.హేమలత, జిల్లా అధికారులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు..

విద్యార్థి మృతిపై సమగ్ర నివేదిక ఇవ్వండి

రాష్ట్ర ఎస్‌టి కమిషన్ చైర్మన్ ఆదేశం

ప్రజాశక్తి - విజయనగరం

పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట ఐటిడిఎ పరిధిలో గల దోనుబాయి గిరిజన ఆశ్రమ పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థి సవర చలపతి మృతి పట్ల రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డాక్టర్ డివిజి శంకరరావు ఆవేదన వ్యక్తం చేశారు. చలపతి మంచంపై నుంచిపడి మృతి చెందిన సంఘటన వివరాలను సంబంధిత అధికారులను చైర్మన్ అడిగి తెలుసుకున్నారు. విద్య కోసం కుటుంబాలకు దూరంగా ఉంటూ చదువుకుంటున్న విద్యార్థుల పట్ల అందరూ బాధ్యతతో వ్యవహరించాల్సివుందనీ, విద్యార్థి మృతికి సంబంధించి జిల్లా అధికారులు సమగ్ర నివేదిక అందించాలని ఆయన ఆదేశించారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

ప్రజాశక్తి - సాలూరు

విద్యార్థులు పోక్సో వంటి చట్టాలపై అవగాహన పెంచుకోవాలని గజపతినగరం, సాలూరు సివిల్ జడ్జీలు కనకమహాలక్ష్మి, కె.రమేష్ కోరారు. బాలికలు, మహిళలపై లైంగిక వేధింపులకు, అత్యాచారానికి పాల్పడితే కఠినమైన శిక్షలు ఎదుర్కోవాల్సి వస్తుందని చెప్పారు. స్మార్ట్ ఫోన్లతో విద్యార్థులు ఎక్కువ సమయం గడపకుండా ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని సూచించారు. కార్యక్రమంలో టౌన్ సిఐ అప్పలనాయుడు, బార్ అసోసియేషన్ అధ్యక్షులు టి.తిరుపతిరావు, కళాశాల ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పంచాంగ శ్రవణాలు

ప్రజాశక్తి - పార్వతీపురం రూరల్

తెలుగు నూతన సంవత్సరాది ఉగాది సందర్భంగా మండలంలోని అన్ని గ్రామాల్లో శనివారం పంచాంగ శ్రవణాలు నిర్వహించారు. రామమందిరాల్లో గ్రామస్తులు చేరి, కొత్త ఏడాదికి స్వాగతం పలుకుతూ గ్రామ పెద్దల ఆధ్వర్యంలో నిర్వహించిన పంచాంగ శ్రవణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ సంవత్సరం జోరుగా వర్షాలు కురిసి, వ్యవసాయం ఆశాజనకంగా ఉండాలని, ప్రతి ఒక్కరికీ పని దొరకాలని, సుఖ సంతోషాలతో ఈ ఏడాది గడవాలని ఆశాభావం వ్యక్తం చేశారు.

తుమరాడ పాఠశాలను సందర్శించిన ఎంపిపి

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని తుమరాడ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను శనివారం స్థానిక ఎంపిపి బొమ్మాలి భాను సందర్శించారు. పాఠశాల విద్యార్థుల విద్యాభ్యసన స్థాయిలను ఆమె తెలుసుకొని సంతృప్తి వ్యక్తం చేశారు. మధ్యాహ్నం భోజనం పథకం మెనూకు సంబంధించి వంట నిర్వాహకులతో మాట్లాడి తగు సూచనలు చేశారు. పిల్లల చదువు విషయంలో ఉపాధ్యాయులతో కొద్దిసేపు చర్చించారు. కార్యక్రమంలో సిఆర్‌పి బొమ్మాలి సుధాకరరావు, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్‌పర్సన్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఇతర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు కార్మికుల సంతకాలు సేకరణ

ప్రజాశక్తి - సాలూరు

మున్సిపాల్టీ, కార్పొరేషన్లలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులందరినీ పర్మినెంట్ చేయాలని మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ యూనియన్ (సిఐటియు) డిమాండ్ చేసింది. రాష్ట్ర ప్రభుత్వం ఆప్కాస్ రద్దు చేస్తామని ప్రకటించినప్పుడు పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు పురపాలక శాఖ మంత్రి నారాయణకు వినతిని ఇచ్చేందుకు కార్మికుల సంతకాల సేకరణ శనివారం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి యూనియన్ సాలూరు కమిటీ అధ్యక్షులు రాముడు, కార్యదర్శి శంకర్రావు, కమిటీ నాయకులు మధుమోహన్, శ్రీను, రవి మాట్లాడారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం కార్మికుల భవిష్యత్తు కాంట్రాక్టర్ల చేతుల్లో పెట్టాలని చూస్తే 279 రద్దు కోసం ఏ తరహా పోరాటాన్ని చేపట్టామో టిడిపి ప్రభుత్వం మళ్లీ అలాంటి పోరాటం ఉంటుందని హెచ్చరించారు. అలాగే గత సమ్మెలో చేసిన ఒప్పందాలు కోసం కృషి చేయాలని, 62 ఏళ్ల వయస్సు కార్మికులందరికీ వర్తింపచేయాలని డిమాండ్ చేశారు. ఇచ్చిన హామీలను అమలు చేయకపోతే భవిష్యత్తులో మరోసారి పోరాటానికి సిద్ధపడతామని హెచ్చరించారు.



సంతకాలు సేకరిస్తున్న మున్సిపల్ కార్మికులు

ఒడిశా అధికారుల దౌర్జన్యాలకు అడ్డుకట్ట వేయాలి

ఇవిఎం గోదాముల తనిఖీ

ప్రజాశక్తి-నెల్లిమర్ల

ఈవిఎం గోదాములను జిల్లా కలెక్టర్ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ శనివారం తనిఖీ చేశారు. షట్టర్లకు వేసిన సీళ్లను తెరిపించి, లోపల గదుల్లో ఉంచిన ఈవిఎంలను పరిశీలించారు. మొత్తం ఏడు నియోజకవర్గాల గదులను తెరిపించి తనిఖీ చేశారు. అనంతరం దగ్గరుండి సీళ్లను వేయించారు. గోదాములవద్ద భద్రతను సమీక్షించారు. అప్రమత్తంగా ఉండాలని పోలీసు సిబ్బందిని ఆదేశించారు. తనిఖీల్లో డిఆర్ఒ ఎస్.శ్రీనివాసమూర్తి, ఆర్‌డిఒ డి.కీర్తి, తాహశీల్దార్ సుదర్శన్, ఎన్నికల సూపరింటిండెంట్ భాస్కరరావు, ఇతర రెవెన్యూ సిబ్బంది, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

పన్నుల వసూలుకు ప్రత్యేక కౌంటర్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఆస్తిపన్ను బకాయిలపై ప్రభుత్వం 50శాతం వడ్డీ రాయితీ ప్రకటించిన నేపథ్యంలో ఈనెల 30, 31 తేదీలలో నగరపాలక సంస్థ కార్యాలయంలో పన్ను వసూలుకు ప్రత్యేక కౌంటర్లు పనిచేసే విధంగా చర్యలు తీసుకున్నామని కమిషనర్ నల్లనయ్య తెలిపారు. వడ్డీపై రాయితీ వినియోగించుకునేందుకు ఈనెల 31వ తేదీతో గడువు ముగియనున్నదని చెప్పారు. గత రెండు రోజులుగా పెద్ద ఎత్తున పన్ను బకాయిలు చెల్లించేందుకు ప్రజలు వస్తున్నారన్నారు. దీన్ని దష్టిలో పెట్టుకొని ఆది, సోమవారాలలో కూడా ఆస్తిపన్ను వసూళ్ళ కౌంటర్లు ఉదయం 6 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు పని చేస్తాయని తెలిపారు.

పోరుబాటను విజయవంతం చేయండి: యుటిఎఫ్

ప్రజాశక్తి-దత్తిరాజేరు

ఆర్థిక, విద్యా రంగ సమస్యలపై యుటియఫ్ ఆధ్వర్యంలో ఈనెల 31న శ్రీకాకుళం అంబేద్కర్ ఆడిటోరియంలో జరుగనున్న పోరుబాట సదస్సుకు ఉపాధ్యాయులంతా హాజరై విజయవంతం చేయాలని యుటియఫ్ నాయకులు కిల్లాడ అప్పారావు, పి రాంప్రసాద్ కోరారు. కోమటిపల్లి పాఠశాల వద్ద జరిగిన యుటిఎఫ్ మండల కార్యవర్గ సమావేశంలో పోరుబాట గోడపత్రిక ఆవిష్కరణ చేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిఆర్‌సి అమలుకు కమిటీ ఏర్పాటు చేయాలని, ఐఆర్ ప్రకటించాలని, యూపి పాఠశాలలు యథాతథంగా కొనసాగించాలని, అన్ని గ్రామాల్లో ఆదర్శ ప్రాథమిక పాఠశాలలు ఏర్పాటు చేయాలని, ఉన్నత పాఠశాలల్లో సమాంతర మీడియంలు అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో యుటియఫ్ నాయకులు చంద్రరావు, వి హరీష్, యస్ ధనంజయరావు, జె.వెంకటరావు, జె.వెంకటరమణ, టి.రమేష్, యస్ చంద్రశేఖరరావు, మండల కార్యవర్గసభ్యులు పాల్గొన్నారు.

కొటియా గ్రామ సరిహద్దు సమస్యలు పరిష్కరించాలి

కలెక్టర్‌కు సిపిఎం, గిరిజనులు వినతి

ప్రజాశక్తి - పార్వతీపురం

గిరిజనులకు రక్షణ కల్పించాలని, ఆంధ్రా-ఒడిశా ప్రభుత్వాలు చర్చల ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని కోరుతూ కలెక్టర్ శ్యాంప్రసాద్‌కు కొట్టియా గ్రామస్తులు, సిపిఎం నాయకులు శనివారం వినతి పత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ సాలూరు మండలం గంజాయి భద్ర పంచాయతీ ఆంధ్రా - ఒడిస్సా సరిహద్దు ప్రాంతంలో గల కొటియా గ్రామాలపై ఒడిశా ప్రభుత్వం గిరిజనులపై గిరిజనులు సాగు చేస్తున్న భూములపై దౌర్జన్యం చేస్తుందని, దిగుసెంబి గ్రామానికి చెందిన తాడంగి సన్నం, తాడంగి రాజు తదితరులు సాగు భూములను దౌర్జన్యంగా లాక్కొని కంచి వేసి బెదిరింపులకు దిగుతుందని ఇదేమని ప్రశ్నిస్తే, తిరగబడుతూ ఈ భూములు తమవేనని, ఇక్కడికి రావద్దని ఒడిశా అధికారులు హెచ్చరిస్తున్నారని తెలిపారు. మేము సాగు, నివాసం ఉన్న ఈ ప్రాంతమంతా షెడ్యూల్ గ్రామాల జాబితాలో ఉందని, పీసా చట్టం అమలవుతుందని, మన రాష్ట్ర ప్రభుత్వం ఒడిశా అధికారుల దౌర్జన్యాన్ని అడ్డుకొని స్థానిక గిరిజనులకు రక్షణగా ఉండాలని కోరారు. దశబ్దాల కాలంగా కొట్టియా సరిహద్దు గ్రామాల సమస్యకు రెండు రాష్ట్రాలు చర్చల ద్వారా శాశ్వత పరిష్కారం చూపాలని, గిరిజనులకు అన్యాయం చేకూర్చే ఇటువంటి ప్రక్రియలను వెంటనే అడ్డుకట్ట వేయాలని అన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, సాలూరు, పాచిపెంట మండల కార్యదర్శులు మర్రి శ్రీను, కోరాడ ఈశ్వరరావు, మండల నాయకులు సీదరపు అప్పారావు, టి.సనమ్మ, సీతమ్మ, భీమ్మ, గెమ్మల బీసు పాల్గొన్నారు.